Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 149 పేజీలు 8 వెల : 5 ఆదివారం 30 నవంబర్ 2025

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో

మరో సంచలనం

వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ఉత్తేజిత తెలుగు దినపత్రికకు మరియు UV9 కేబుల్ Tv చానెల్ కు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ల నందు పనిచేయుటకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు నియోకవర్గాల వారిగా ఆర్.సి.ఇన్‌చార్జిలు మండలాల వారిగా విలేకరులు కావలెను



ఉత్తేజిత దినపత్రిక UV9

Contact : 94401 40418, 63038 17489




2లో..

## విశాఖ హోటళ్లలో దారుణం

నాసిరకం, పాచిపోయిన ఫుడ్ సరఫరా

అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అధికారుల హెచ్చరిక




## మూడు ప్రాంతాల అభివృద్ధికి

# ప్రత్యేక జోన్లు

రజాధాని రైతుల నుంచి డబ్బులు డిమాండ్

సిఆర్‌డిఎ అధికారులతీరుపై మండిపడ్డ సిఎం

కఠిన చర్యలు తీసుకుంటామని గట్టిగా హెచ్చరిక

మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం చంద్రబాబు



2లో..

వరదలకు ఇప్పటికే 123మంది మృతి

మరికొందరి ఆచూకీ గల్లంతు

దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటన

# శ్రీలంకను

## అతలాకుతలం చేసిన దిత్వా



# తిరుమల కల్తీనెయ్యి కేసు

### మరో 11మందిని నిందతులుగా చేర్చిన అధికారులు

తిరుమల: తితిదే కల్తీ నెయ్యి కేసులో సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణ వేగవంతం చేసింది. కేసు నమోదు చేసిన సమయంలో 15 మందిని, ఆ తర్వాత 9 మందిని నిందితులుగా పేర్కొన్న సిట్.. తాజాగా మరో 11 మందిని నిందితులుగా చేరుస్తూ నెల్లూరు ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేసింది. వారిలో ఏడుగురు తితిదే ఉద్యోగులు ఉన్నారు. 2019-2024 మధ్య తితిదే కొనుగోలు విభాగంలో పని చేసిన జీఎంలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లపై సిట్ కేసులు నమోదు చేసింది. గతంలో జీఎంలుగా పని చేసిన జగదీశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణ, ఎస్వీ గోశాల పూర్వ డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి ఇందులో ఉన్నారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు పేర్కొన్న నిందితుల సంఖ్య 35కి చేరింది. వారిలో 10 మందిని అరెస్టు చేశారు.



# కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

రెండు కార్లు ఢీకొని ఐదుగురు మృత్యువాత

ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు మృతి

మంత్రాలయం దర్శనం కోసం వస్తుండగా ఘటన

మృతులు కర్నాటక వాసులుగా గుర్తింపు

కర్నూలు కర్నూలు జిల్లా పరిధిలో శనివారం ఉదయం రెండు రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఓ ప్రమాదంలో రెండు కార్లు ఢీకొని ఐదుగురు కర్నాకట వాసులు దుర్మరణం చెందారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని కొటేకల్ గ్రామం వద్ద ఈ ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది.. రెండు కార్లు ఢీకొన్న ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా మొత్తం ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు. కర్ణాటక నుంచి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం దర్శనం కోసం మంత్రాలయం వెళు తుండగా.. కోటేకల్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వీరిని కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా చిక్కహోసల్లి గ్రామానికి చెందిన.. వెంకటేశప్ప(60), ఆయన కూతురు మీనాక్షి(32), అల్లుడు సతీశ్(36), మనవళ్లు రుత్విక్, బన్నీగౌడ్‌లుగా తేల్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బెంగళూరు నుంచి మంత్రాలయం వెళు తున్న కర్ణాటక బస్సు పత్తికొండ పరిధిలోని తుగ్గలి, రాతన గ్రామాల మధ్య బోల్తాపడింది. ఆ సమయంలో బస్సులో 29 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం.



# భూములు అమ్ముకునే కుట్ర

గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ వ్యాపారం

సిఎం రేవంత్‌పై సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ ఆరోపణలు

16 ఏండ్ల క్రితం ఉద్యమాన్ని మలుపుతిప్పిన దీక్ష

ఆనాటి రోజులు గుర్తు చేసుకున్న కెటిఆర్, హరీష్

**సిద్దిపేట:** గ్లోబల్ సమ్మిట్ పెట్టి భూములు అమ్ముకునేందుకు రేవంత్‌రెడ్డి ప్లాన్ చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీమంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం రియల్ వ్యాపరమం కోసమే ఈ సమ్మిట్ అని ఆరోపణలు చేశారు. సిద్ధిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ..నవంబర్ 29వ తేదీ ఒక చరిత్ర.. ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు ఇదని చెప్పుకొచ్చారు. ఉద్యమానికి సిద్ధిపేటకు అవినాభావ సంబంధం ఉందని గుర్తుచేశారు. సిద్ధిపేటలో జరిగిన ఉద్యోగుల గర్జన ఒక చరిత్ర అని వివరించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష ఒక చరిత్ర.. ఎన్నో త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని పేర్కొన్నారు.'తెలంగాణ రాష్ట్రం కోసం మాజీ సీఎం కేసీఆర్ పోరాడారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కేసీఆర్ పోరాటం గురించి మూర్ఖంగా మాట్లాడుతున్నారు. డిసెంబర్ 9వ తేదీ తెలంగాణ రాష్ట్ర ప్రకటన కేసీఆర్ దీక్ష ఫలితమే. మిలియన్ మార్చ్ మా వంతు.. మిలియన్‌ల కొద్దీ డబ్బు మూటలు కట్టి ఢిల్లీకి పంపుడు కాంగ్రెస్ వంతు. తెలంగాణ ఉద్యమ ద్రోహి రేవంత్‌రెడ్డికి కోదండ రామ్ దగ్గర అయ్యారు. మన నిధులు, మన నీళ్లు మనకు దక్కేలా చేసింది కేసీఆర్. కృష్ణానది నీళ్ల పంపకంపై ఆంధ్రప్రదేశ్.. తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచేలా ట్రైబ్యునల్ ముందు మూడు రోజులుగా వాదిస్తుంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు ఈ విషయంపై మాట్లాడటం లేదు. తెలంగాణ రాష్ట్ర మూడు కోట్ల ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచాలని చూడొద్దు. తెలంగాణ రావడంతోనే మన రాష్ట్రం పచ్చని మాగాణిగా మారి పంటలు పండుతున్నాయి. రాష్ట్రం ఉన్నంత కాలం కేసీఆర్ పోరాట చరిత్ర ఉంటుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్ధిపేట అర్బన్ మండలం పొన్నాలలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం దీక్ష దివస్ జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవ రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఇటీవల మరణించిన ఉద్యమకారుడు అందెశ్రీకి నివాళులు అర్పించారు నాయకులు.



2లో..

## ఎనర్జీ ఉంటేనే పెట్టుబడులు

స్టోరేజీకి అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



2లో..

## కర్నాటకలో మళ్లీ రాజకీయ సెగ

కాంగ్రెస్ అధిష్టానం ఆదేశంతో సిద్దుతో డికె భేటీ

ఇరువురు నేతలు బ్రేక్‌ఫాస్ట్ చర్చలు

2028లో గెలుపు కోసం చర్చించామని వెల్లడి



## డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు

అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం

ఫేక్ కాల్స్ ఎత్తి సమాచారం ఇవ్వరాదు

అనుమానం ఉటే 1930కు ఫిర్యాదు చేయాలి

ప్రజలను అప్రమత్తం చేసిన హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్

2లో..

# తెలంగాణలో రాజకీయ కోలాహలం

### ముగిసిన తొలిదశ నామినేషన్ల గడువు

హైదరాబాద్:తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. రాష్ట్రంలో తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ పక్రియ గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే. శనివారంతో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. తొలి రోజే సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజు సర్పంచి పదవుల కోసం 3,242 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 1,821 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 4901 నామినేషన్లు దాఖలు. రెండో రోజు వార్డు మెంబర్ల స్థానాలకు 9643 నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు. రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు 8198 నామినేషన్లు, 11502 వార్డు మెంబర్ నామినేషన్లు దాఖలు అయినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 189 మండలాల్లోని 4,236



సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించనున్నది. 30వ తేదీన నామినేషన్ పత్రాల పరిశీలన చేపడతారు. డిసెంబర్ 3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు పోటీలో ఉన్న తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు చేపట్టి వార్డు సభ్యులు, సర్పంచుల ఫలితాలను వెల్లడిస్తారు.

# మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక జోన్లు

అమరావతి: రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. 3 ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. రాజధాని రైతులంతా ఒకే గొడుగు కిందకు రావాలని పిలుపునిచ్చారు. వారు జెఏసిగా ఏర్పడి ప్రభుత్వంతో సంప్రదింపులకు సిద్దంగా ఉండాలన్నారు. ఈమేరకు సీఎం చంద్రబాబు మీడియాతో ఇష్టాగోష్ఠి సమావేశం నిర్వహించారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులంతా అమరావతి ప్రాంత అభివృద్ధి అసోసియేషన్ కిందకు రావాలని, జేఏసీగా ఏర్పడితే వారితో సంప్రదిస్తూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు గురించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించాం. ఈ అంశంపై కేంద్రం చర్చించి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం అని చంద్రబాబు చెప్పారు.. రాజధాని రైతుల నుంచి ఎవరైనా సిబ్బంది డబ్బులడిగితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. భూ త్యాగాలు చేసిన రైతుల సమస్యలు పరిష్కరించాలి. ఈ విషయంలో తొలుత కొంత గ్యాప్ ఉంది. నాతో సమావేశమైన అనంతరం

రైతులకు అన్నింటిపైనా స్పష్టత వచ్చింది. రాజధాని రైతులు కూడా ఆనందంగా ఉన్నారు. రెండో దశ భూ సమీకరణ ఉపయోగాలను వారికి వివరించానని అన్నారు. అమరావతి ఓ మున్సిపాలిటీగా మిగిలిపోకూడదు. ఇది మహానగరంగా మారితే వచ్చే ఫలితాలను రైతులు అర్థం చేసుకున్నారు. త్రిసభ్య కమిటీ నిరంతరం రైతులతో సంప్రదింపులు జరుపుతోంది. రాజధాని అభివృద్ధి ఇక అన్‌స్టాపబుల్. రాజధాని పరిసర ప్రాంతాల్లో లేఅవుట్ల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం అన్నారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నాం. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టాం. త్వరలోనే కార్యాచరణ రూపొందిస్తాం అని సీఎం చంద్రబాబు తెలిపారు. రైతులకు సంబంధించిన ప్రతి పనికి సిఆర్‌డిఏ అధికారులు డబ్బులు డిమాండ్ చేయడంపై విచారణ చేయిస్తాం అన్నారు. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే రాజధాని రైతుల నుంచి సిబ్బంది డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూమిని త్యాగం చేసిన రైతుల సమస్యలు పరిష్కరించకుండా డబ్బులు డిమాండ్ చేస్తారా అని మండిపడ్డారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం.. ఇందుకు అనుగుణంగా 3 ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకుండా అన్ని ప్రాంతాలు సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది నాటికి అమరావతి నిర్మాణం ఒక కొలిక్కి వస్తుంది.. రాజధాని ప్రాంతంలో కాకుండా మిగిలిన ప్రాంతాల్లో లేఔట్స్ కి త్వరలోనే అనుమతి ఇస్తాం.. క్యాపిటల్ గెయిన్సు కు సంబంధించి కేంద్రం నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. రాజధాని రైతులు కోరిన క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించాం.. కేంద్రం చర్చించి నిర్ణయం తీసుకుంటుంది.. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలన్నీ దశల వారీగా పరిష్కరిస్తాం.. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టాం.. త్వరలోనే ఆ దిశగా కార్యాచరణ రూపొందిస్తామని సూచించారు.

# కర్ణాటకలో మళ్లీ రాజకీయ సెగ



బెంగళూరు: కర్ణాటక సీఎం కుర్చీ కోసం సమరం వేళ కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య , ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లు శనివారం బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు ఒక్కచోట కలిశారు. ఇక్కడ ఇద్దరు నేతల మధ్య సయోధ్య కుదిర్చేందుకు కాంగ్రెస్ నానా తంటాలు పడుతోంది. ఎట్టకేలకు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య శనివారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ జరిగింది. దీనికి సంబంధించి డీకే శివకుమార్ ఎక్స్‌లో పోస్ట్ కూడా చేశారు. ఉదయం బెంగళూరులోని కావేరి నివాసంలో అల్పాహార సమావేశం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలిశానని డీకే చెప్పారు. కర్ణాటక ప్రాధాన్యతలు, ముందుకు సాగాల్సిన మార్గాలపై ఫలప్రదమైన చర్చ జరిగిందని వెల్లడించారు.అయితే, డీకే శివకుమార్ తన ఎక్స్ సందేశంలో తెలుపనప్పటికీ సీఎం సిద్ధరామయ్యతో టీపార్టీ మీటింగ్ ముఖ్యంగా రొటేషనల్ సీఎం ఒప్పందంపై చర్చించుకునేందుకే నన్నది అందరికీ తెలిసిన విషయమే. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకే ఇరువురు నేతలు టీపార్టీ మీటింగ్ పేరిట కలుసుకుని మాట్లాడుకున్నట్టు సమాచారం. ఇలా ఉండగా, 2023లో కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఎవరు రాష్టానికి సీఎం కావాలన్న ప్రశ్న ఉదయించింది. అయితే, అధిష్టానం సూచన మేరకు ఇరువురు నేతలు రొటేషనల్ ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రిగా వ్యవహరించలన్న ఒప్పందం జరిగింది. దీంతో సిద్దారామయ్య సిఎంగా, శివకుమార్ డిప్యూటీగా నియమితులయ్యారు. ఇప్పుడు, ఆయా కాలం పూర్తయ్యే సమయంలో, ఈ ఒప్పందం మళ్లీ తెరమీదకి వచ్చింది. ప్రజల ఎన్నికల తీర్పు ప్రకారం 2028 వరకు పూర్తి కాలంపాటు సీఎంగా వ్యవహరిస్తానని సీఎం సిద్ధరామయ్య పలు సందర్భాల్లో వ్యాఖ్యనించారు. అయితే, అదే సమయంలో పార్టీ హై కమాండ్

నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పుకొస్తున్నారు. దీంతో ఈ ఇప్పుడు ఈ అంశం మీద అందరి దృష్టీ పడింది. మరోవైపు, ఢిల్లీలో సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీలతో స్ట్రాటజీ గ్రూప్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఇరువురు నేతలు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సమావేశంలో పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయం కర్నాటక రాజకీయాల్ని కొత్త మలుపు తిప్పవచ్చు. దీంతో వీరి


భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. కెసి వేణుగోపాలు ఆదేశంతో తాము ఇద్దరం భేటీ అయ్యామని డిప్యూటి సిఎం డికె శివకుమార్ చెప్పారు. తాము 2028 ఎన్నికల గురించి చర్చించామని సిఎం సిద్దరమాయ్య అన్నారు. ఈ భేటీ అనంతరం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని.. ఇకముందు కూడా ఉండబోవని స్పష్టంచేశారు. కేసీ వేణుగోపాల్ సూచనల మేరకు తాము బ్రేక్‌ఫాస్ట్ భేటీలో పాల్గొన్నామని.. కానీ ఏ విషయం పైనా చర్చించలేదని తెలిపారు. నెల రోజుల ముందు నుంచి అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకే ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందన్నారు. భాజపా-జేడీఎస్ తమపై అసత్య ప్రచారాలు చేస్తోందని సిద్ధరామయ్య దుయ్యబట్టారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తాను, డీకే ఉమ్మడిగా ఎదుర్కొంటామని అన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. 2028లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కర్ణాటక ప్రజల మద్దతుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. వారికిచ్చిన వాగ్దానం ప్రకారం తాను సిద్ధరామయ్యతో కలిసి పని చేస్తానని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. తాము పార్టీకి విశ్వాసపాత్రులైన సైనికుల్లా పని చేస్తున్నామని.. హైకమాండ్ ఏం చెప్పినా.. దానిని అందరం అనుసరిస్తామని స్పష్టంచేశారు. ప్రస్తుతం పార్టీ పలు సమస్యలు ఎదుర్కొం టోందని.. 2028లో రానున్న కర్ణాటక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు వెళు న్నామన్నారు. నాయకత్వం విషయంలోనూ హైకమాండ్ నిర్ణయమే ÷నైల్ అని పేర్కొన్నారు. సీఎం సిద్ధరామయ్యతో జరిగిన భేటీలో రాబోయే అసెంబ్లీ సమావేశం సహా పలు విషయాలపై చర్చలు జరిపినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి మార్పు గురించి ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. రెండున్నరేళ్ల తర్వాత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం బాధ్యతలు అప్పగించేలా అప్పట్లో ఓ ఒప్పందం కుదిరిందని ప్రచారం జరుగుతోంది. పార్టీ దీనిని పదే పదే ఖండిస్తున్నా.. ఈ అంశం రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. ఈ నేపథ్యంలోనే పార్టీ హైకమాండ్ సూచనల మేరకు సిద్ధూ, డీకే నేడు ఒక్కచోట సమావేశమయ్యారు.

# ఎనర్జీ ఉంటేనే పెట్టుబడులు



హైదరాబాద్: గ్రీన్ ఎనర్జీ.. దేశ, ఆయా రాష్ట్రాల అభివృద్ధికి చాలా అవసరమని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ అనే చర్చ జరుగుతుందని అన్నారు. పారిస్ లో జరిగిన అగ్రిమెంట్ ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 50 శాతం తప్పకుండా గ్రీన్ ఎనర్జీ ఉండాలని అగ్రిమెంట్ చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంలో గుర్తు చేశారు. తెలంగాణ భవిష్యత్ విద్యుత్ అవసరాలకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్‌తో తెలంగాణ ముందుకు పోతుందని భట్టి వెల్లడించారు. తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా తీర్చి దిద్దుతున్నామని, హైదరాబాద్ గ్లోబల్ హబ్ కాబోతోందని భట్టి తెలిపారు. 2047 వరకు మూడు ట్రిలియన్‌ల ఎకానమీకి చేరుకోవాలనేది లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అందుకు కావలసిన పెట్టుబడులకు అవసరమైనది విద్యుత్ అన్నారు. అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి ప్లానింగ్ చేస్తున్నాం.. పవర్ డిమాండ్ రాష్ట్రంలో పదేళ్లుగా పెరుగుతుందని తెలిపారు. తాజాగా ప్రజా భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. 2014 నుంచి విద్యుత్తు 14.2 డిమాండ్ గ్రోత్ ఉందన్నారు.. 2020-2021 నుంచి 5.44 గ్రోత్, 2024- 25లో 9.8 శాతం గ్రోత్ కనిపించిందని వెల్లడించారు. 2025 నుంచి 34, 35 వరకు తెలంగాణలో 6.4 గ్రోత్ ఉండే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మూసి ప్రక్షాళన.. ఫ్యూచర్ సిటీ.. పెట్టుబడుల ఒప్పందం.. పరిశ్రమలు.. డేటా సెంటర్లతో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా మారబోతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 8.50 గ్రోత్ ఉండబోతుంది.. 2047 కి లక్ష 39 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం.. తెలంగాణలో 2026 ఏప్రిల్ నాటికి 24769 మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉంది.. వాడే విద్యుత్తులో 50 శాతం గ్రీన్ ఎనర్జీ వాడాలి.. ఎనర్జీ స్టోరేజ్ ప్లాన్ గతంలో లేదు.. పదేళ్ల క్రితం ప్లాన్ చేసుకుని ఉంటే బాగుండేది.. అవసరాలకు అనుగుణంగా ఎనర్జీ స్టోరేజ్ ప్లానింగ్ లేదు.. గ్రీన్ పవర్ ఎనర్జీ స్టోరేజ్‌కి తెలంగాణ అనుకూలం.. పదేళ్లుగా ఇలాంటి ప్రయత్నాలు చేయలేదు.. కానీ ఏపీ మొదలుపెట్టింది.. తెలంగాణలో మాత్రం ఆ ప్రయత్నమే లేదు.. థర్మల్ పవర్ కంటే.. గ్రీన్ ఎనర్జీ వస్తుంది.. కానీ తెలంగాణ అందుకోలేక పోయింది. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత.. డిలైట్ లాంటి వాళ్ళను నివేదిక ఇవ్వండి అని అడిగాం.. ఒక్కరోజు బ్లాక్ ఔట్ అయితే 1500 నుండి 2000 కోట్లు నష్టపోతం.. అని వెల్లడించారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు




హైదరాబాద్: డిజిటల్ అరెస్ట్ పేరుతో దేశవ్యాప్తంగా పెరుగుతున్న కొత్త రకం సైబర్ మోసాల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ యూనిట్ తాజాగా ప్రజలకు ముఖ్య హెచ్చరిక జారీ చేసింది. ఇలాంటి మోసాలు హైదరాబాద్‌లో కూడా విస్తరిస్తున్నాయి. నకిలీ పోలీస్, సీబీఐ, ఈడీ, కస్టమ్స్, లేదా కోరియర్ కంపెనీల అధికారులుగా నటిస్తూ కాల్ చేసే మోసగాళ్లు, మనీ లాండరింగ్, టెర్రరిజం, నార్కోటిక్స్ కేసులు, ట్రాఫికింగ్ వంటి తీవ్ర నేరాల్లో కేసులు నమోదయ్యాయని చెప్పి ప్రజలను భయపెట్టి డబ్బు లాక్కోవడం ఈ స్కాం కీలక లక్ష్యంగా పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి కాల్స్ ద్వారా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. బాధితులకు వీడియో కాల్ లేదా ఫోన్ ద్వారా అరెస్ట్ చేస్తున్నాం అని నటిస్తూ, ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని, వారెంట్లు జారీ అయ్యాయని నమ్మించి మోసం చేస్తారని హెచ్చరించారు. మోసగాళ్లు తమ కుట్రను బలపరచేందుకు నకిలీ వారెంట్లు, లేఖలు వంటి కట్టుకథల డాక్యుమెంట్లు తయారు చేసి పంపిస్తారు. అనుమానం లేకుండా ఉండేందుకు కుటుంబ ప్రతిష్టకు హాని కలుగుతుందని చెప్పి ఒత్తిడి పెంచుతారు. కేసు నుండి బయటపడాలంటే భారీ మొత్తం డబ్బు సేకరించి సుప్రీం కోర్టుకు డిపాజిట్ చేయాలి అని చెప్పి వెంటనే ట్రాన్స్ఫర్ చేయిస్తారు. కుటుంబ సభ్యులకు చెప్పొద్దని హెచ్చరిస్తూ సోషల్ ఇంజినీరింగ్ పద్ధతులను వినియోగిస్తారని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్ యూనిట్ ప్రజలకు స్పష్టమైన సూచనలు ఇస్తోంది.. డిజిటల్ అరెస్ట్ అనే దాంట్లో ఏమీ లేదు. నిజమైన పోలీసులు ఎప్పుడూ ఫోన్, లేదా వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరు. కాలర్ స్పూఫ్ చేయబడవచ్చు కాబట్టి ఏ అధికారిక కాల్ వచ్చినా వెంటనే నమ్మేయకూడదు. పాన్, ఆధార్, బ్యాంక్ వివరాలు వంటి వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని ఎవరితోనూ పంచకూడదు. అనుమానం వచ్చిన వెంటనే కాల్‌ను కట్ చేసి, కాలర్ ఇచ్చిన నంబర్లకు తిరిగి కాల్ చేయకుండా, స్థానిక పోలీస్ స్టేషన్ లేదా ప్రభుత్వ అధికారిక హెల్ప్‌లైన్‌ద్వారా మాత్రమే ధృవీకరించాలి. మెసేజ్లు, స్క్రీన్‌షాట్లు, కాల్ లాగ్స్ వంటి సాక్ష్యాలను భద్రపరచడం కూడా చాలా ముఖ్యమని అధికారులు తెలిపారు. ఇలాంటి మోసాలు ఎదురైనపుడు వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలని లేదా ఫిర్యాదు చేయాలని సూచించారు. తాజా అప్డేట్ల కోసం హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ అధికారిక సోషల్ మీడియా పేజీలను,ఖాతాలను ఫాలో కావాలని చెప్పారు. డిజిటల్ ప్రపంచం వేగంగా మారుతున్న కొద్దీ మోసగాళ్ల పద్ధతులు కూడా అధునాతనంగా మారుతున్నాయి. ఒక్క ఫోన్ కాల్, ఒక్క మెసేజ్ కూడా భారీ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు.

## శ్రీలంకను అతలాకుతలం చేసిన దిత్వా

కొలంబో: దిత్వా తుఫాను కారణంగా శ్రీలంక చిగురుటాకులా వణికింది. ఈ ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ఇప్పటి వరకు 123 మంది మరణించగా.. అనేక మంది గల్లంతయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో శ్రీలంక ప్రభుత్వం దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. వరదల వల్ల ఏర్పడిన విధ్వంసం కారణంగా తలెత్తిన అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే దేశమమంతటా అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. శనివారం శ్రీలంకను దాటిన దిత్వా తుఫాను 123 మందికి పైగా ప్రాణాలను బలిగొందని, విధ్వంసం, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లిందని ఆ దేశ అధికారులు తెలిపారు. 'దిత్వా శ్రీలంక నుండి భారత తీరం వైపు వెళ్లింది. ఈ క్రమంలో భారీ వర్షం, అధిక వేగంతో కూడిన గాలులు వీశాయి. ఈ తుఫాన్ కారణంగా ఇప్పటికే అనేక ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయాయి. ఎంతో మంది జీవనం అస్తవ్యస్తంగా మారింది' అని వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ అతుల కరుణనాయకే మీడియాతో తెలిపారు. ఇదే సమయంలో విపత్తు నిర్వహణ కేంద్రం శనివారం ఓ ప్రకటనలో పలు విషయాలను వెల్లడించింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయనియని తెలిపింది. 43వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని డీఎంసీ జనరల్ డైరెక్టర్ సంపత్ తెలిపారు. పోలీసులు, అధికారులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నా యన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి మరీ దయనీయంగా ఉందన్నారు. వందలమందిని తాత్కాలిక పునరావాసాలకు తరలించామని డీఎంసీ జనరల్ డైరెక్టర్ వెల్లడించారు.

## శుక్రమౌఢ్యమి ప్రవేశంతో శుభకార్యాలకు సెలవు

### ఫిబ్రవరి వరకు ముహూర్తాలు లేవంటున్న పండితులు

తిరుమల: గ్రహాల గమన స్థితిని బట్టి ఇప్పుడు శృక్ర మౌఢ్యమి నడుస్తోంది. దీంతో శుభకార్యాలకు తావు లేదు. సాధరణంగా డిసెంబర్‌లో మళ్లీ మంచి ముహూర్తాలు వచ్చేవి కానీ ఈ యేడు అలాంటి అవకాశం లేదు. ఈసారి దాదాపు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలు లేవని పండితులు సెలవిస్తున్నారు. ఈనెల 26న మార్గశిర మాసం శుద్ధ షష్ఠి నుంచి ప్రారంభమైన శుక్ర మౌఢ్యమి మాఘ బహుళ అమావాస్య ఫిబ్రవరి 17 వరకూ కొనసాగనుంది. దీంతో సుమారు 84 రోజుల పాటు శుభకార్యాలకు ముహూర్తాలు లేవు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం.. ఒక గ్రహం సూర్యుడి కిరణాలలో కనుమరుగై పోవడాన్ని మౌఢ్యమి అంటారు. దీనినే వాడుక భాషలో మూఢమి అంటే చీకటి అంటారు. శుభకార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడూ అంతే ప్రభావం కలవాడు. గ్రహశక్తులు బలహీనమవడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వంలో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిషులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభసూచకం కాదని సూచిస్తున్నారు. మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. అయితే.. ఈసారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలే ఉండగా.. పుష్యం శూన్య మాసం అవుతుంది. ఇక మాఘంలోనూ ఒక్క మూహూర్తం లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథ సప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి మహామాఘ్‌గా కీర్తించబడే మాఘ పౌర్ణమి వంటి తిథులూ ఈసారి మూఢంలోనే కలిసిపోయాయి.

## ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు నవంబర్ 29 :**



నందికొట్కూరు నియోజవర్గంఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన మిద్దూరు మండలంలోని రోళ్లపాడు, మిద్దూరు, తిమ్మాపురం గ్రామాల ఆత్మకూరు లక్ష్మీదేవి కి2,39,305/- రూపాయలు షేక్ హుసైన్ బాష కి 20,000/- రూపాయలు వడ్డే నాగమ్మ కి 68,000/- రూపాయలు (4) పి లింగమయ్య కి 35,000/- రూపాయలు (5) వసుందర కి 23,920/- రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే గిత్త జయసూర్య చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో :- కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి , క్లస్టర్ ఇంచార్జ శివరామి రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ రాజశేఖర్ రెడ్డి, స్వామి రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ సర్వోతం రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సుధాకర్ యాదవ్, యూనిట్ ఇంచార్జ్ నాగేంద్ర, వీరారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అయ్యన్న, వెంకటేశ్వర్ రెడ్డి, నాగేశ్వరావు, మాదిరెడ్డి, కడుమూరు సుధాకర్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, నరసింహా గౌడ్,ఇడమకంటి మోరలీధర్ రెడ్డి, రమణారెడ్డి, సోఫిసాహెబ్, గుడిపాడు మహేష్, గ్రామ మరియు మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ శివరాం కుటుంబాన్ని :పరామర్శించిన ఎమ్మెల్యే

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు నవంబర్ 28:**



నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండల తహసీల్దారు శివరామ్ తండ్రి శనివారం అకాల మరణం చెందడం జరిగినది. విషయం తెలుసుకున్న నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య కర్నూలు పట్టణంలోని వారి స్వగృహం నందు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పగిడ్యాల మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి పాల్గొనడం జరిగినది.

# విశాఖ హోటళ్లలో దారుణం



విశాఖపట్టణం: పర్యాటక నగరంగా పేరుగాంచిన విశాఖపట్నంలో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు కస్టమర్ల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పేరుకు మాత్రమే హంగులతో ఆకర్షిస్తూ, లోపల మాత్రం రోజుల తరబడి నిల్వ ఉంచిన పాచిపోయిన ఆహారాన్ని వేడి చేసి వడ్డిస్తున్నారు. రుచి కోసం రకరకాల రంగులు, హానికరమైన రసాయనాలు కలుపుతూ ప్రజల జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎన్నిసార్లు తనిఖీలు చేపట్టినా యాజమాన్యాల తీరు మారకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి హోటళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తాము తినే పదార్థాలు తాజావా కాదా అని నిర్ధారించుకోవాలని హచ్చరించారు. నగరంలో హోటళ్ల అరాచకం రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో, ఆహార భద్రతా ప్రమాణాల శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో అధికారులకు కళ్లు బైర్లు కమ్మే దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. దాదాపు ఏ రెస్టారెంట్ చూసినా కల్తీగా మారిపోయింది. ఈ ఏడాది ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన విస్తృత తనిఖీల్లో 40 హోటళ్లు, రెస్టారెంట్లలో కిలోల కొద్దీ నిల్వ ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా 17 హోటళ్లలో అత్యంత దారుణ స్థితిలో ఉన్న ఆహారాన్ని గుర్తించి, వాటిపై కేసులు నమోదు చేశారు. అక్కయ్యపాలెంలోని నరసింహ నగర్ లో ముంతాజ్ హోటల్ ఈ ఏడాది జూన్ నెలలో జరిపిన తనిఖీల్లో ఇక్కడ కుళ్లిపోయిన కోడిగుడ్లు, చికెన్, చేప, రొయ్య వంటకాలను గుర్తించారు. హోటల్‌పై కేసు కూడా నమోదు చేశారు. అలాగే, ఎంవీపీ కాలనీలో గల ఆహా ఏమి రుచులు రెస్టారెంట్ లో ఆగస్టు 22న జరిపిన దాడుల్లో ఈ రెస్టారెంట్లో నాలుగైదు రోజులకు మించి నిల్వ ఉన్న 85 కిలోల చికెన్, మటన్, రొయ్యలు, చేపలను అధికారులు గుర్తించారు.

ఉత్తేజిత దినపత్రిక


# ఎస్సీ, ఎస్టీల సమస్యలపై మూడవ త్రైమాసిక జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎప్పటికప్పుడు త్వరితగతిన పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ మరియు కమిటీ చైర్‌పర్సన్ డా. ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,నవంబర్ 29 :**

జిల్లాలో ఎస్సీ, ఎస్టీల కు సంబంధించిన సమస్యల పట్ల స్వయంగా తనిఖీ చేసి తక్షణమే పరిష్కారం చూపుతూ నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ చైర్‌పర్సన్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ గారి అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి చిత్తూరు పార్లమెంటు సభ్యులు కమిటీ చైర్మన్ దగ్గు మళ్ల ప్రసాద్ రావు ఎస్పీ సుబ్బరాయుడు, డిఆర్ఓ నరసింహులు, సత్యవేడు మరియు సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు ఆదిమూలం, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తిలతో కలిసి సమావేశం జరిగింది. చిత్తూరు పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ... ప్రధానంగా దీర్ఘకాలిక సమస్యకు తక్షణమే పరిష్కార మార్గాలను చూపడంతో పాటు,.. అధికారులు చిత్తశుద్ధితో తమ కర్తవ్యాన్ని నిర్వర్తించి, పేదలకు అండగా ఉండాలని తెలిపారు. అధికారులు అంకిత భావంతో పని చేసి, ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచనలు తెలిపారు..

జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ప్రవేశపెట్టి సమీక్షించిన ప్రతి అంశానికి త్వరితగతిన పరిష్కార మార్గాలను చూపాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం చూపేలా న్యాయం చేయాలని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం ద్వారా లబ్ధిదారులకు గృహాలు మంజూరు పై దృష్టి పెట్టి వారికి గృహాలను మంజూరు చేయాలని హౌసింగ్ డిపార్ట్మెంట్ వారి నీ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ఆయా శాఖల సమాధానాలను పరిశీలించిన అనంతరం, జాప్యం జరిగిన అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసులు త్వరితంగా పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు.ఎస్సీ, ఎస్టీ వర్గాల ఇళ్లకు సంబంధించి పట్టాలు మంజూరు, భూ సమస్యలు డాక్టర్ బి బిఆర్ అంబేద్కర్ భవనం నిర్మాణం వంటి సమస్యలపై కమిటీ సభ్యులు విన్నవించుకోగా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అంబేద్కర్ భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయింపు విషయంలో పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ల గ్రీవెన్స్ కింద వచ్చే సంవత్సరం పరిశీలించి త్వరలో కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కారం ద్వారా సమస్యలకు సంబంధించిన ప్రత్యేక సమావేశం కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గత సమావేశంలో కమిటీ సభ్యులు గుర్తింపు కార్డుల కోసం ఎన్నవించుకోగ ఈ సమావేశంలో వారికి గుర్తింపు కార్డులను జిల్లా కలెక్టర్ అందజేశారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం ద్వారా లబ్ధిదారులకు గృహాలు మంజూరు సంబంధించిన స్థలాన్ని గుర్తించడం, మంజూరు చేయడం వంటి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి గృహాలను మంజూరు చేయాలని హౌసింగ్ డిపార్ట్మెంట్ వారి నీ ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ..జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీల సమస్యల పై పరిష్కార దిశగా కృషి చేయాలి అని తెలిపారు. ఎస్సీ ఎస్టీల అట్రాసిటీ తదితర కేసులను జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సీరియస్ గా తీసుకొని పరిష్కరించేలా చూడాలని తెలిపారు. జిల్లాలోని మండల స్థాయి, జిల్లా స్థాయిలో లాండ్ ఆర్డర్ పాటిస్తూ కేసుల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని శాఖవారిని ఆదేశించారు. కమిటీ సభ్యులు అట్రా సిటీ కేసులకు సంబంధించి ఎస్పి గారికి విన్నవించుకోక వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి సంబంధిత బాధితులకు న్యాయం చేస్తానని తెలిపారు. సత్యవేడు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సత్యవేడు నియోజకవర్గం లోని పలు ఎస్సీ, ఎస్టీ లకు సంబంధించిన సమస్యలపై వివరిస్తూ.. త్వరితగతన సమస్యల పరిష్కారానికి సంబంధిత డివిజన్ స్థాయి, జిల్లా స్థాయి అధికారులు దృష్టి పెట్టాలని తెలిపారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ చెందిన భూములు, ఇళ్ల పట్టాలు వంటి సమస్యలపై వివరిస్తూ అందరికీ న్యాయం జరిగేలా పరిష్కారం చూపాలని తెలిపారు. ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ కు సంబంధించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన నిర్మాణం కోసం స్థల సేకరణ కు పనులను పూర్తి చేయాలని అన్నారు. ప్రధానమంత్రి ఆవాస యోజన కింద గృహాల మంజూరు విషయాలలో గృహ నిర్మాణ శాఖ వారు అర్హతను పట్టి మంజూరు చేయాలని తెలిపారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ కమిటీ సభ్యుల దగ్గర నుంచి అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీలు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓ లు రామ్మోహన్ , భాను ప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, జిల్లా సాంఘిక సంక్షేమ మరియు సాధికార అధికారి

విక్రమ్ కుమార్ రెడ్డి, డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్, డీవీఎంసి సభ్యులు, జిల్లా అధికారులు, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐ నిబంధనలను సడలించి పత్తి పంటను పూర్తిగా కొనుగోలు చేయాలి!

### కపాస్, కిసాన్ యాప్ ను ఎత్తివేయాలి!!

### ఐదుకరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు



**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

ఎమ్మిగనూరు నవంబర్ 29 శనివారం నవంబర్ 29సీసీఐ నిబంధనలు సడలించి పత్తి పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని ఏఐకేఎస్ నాయకులు కరపత్రం విడుదల చేశారు. శనివారం ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు లక్ష్మీ నరసయ్య, అబ్దుల్లా మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రంలో, జిల్లాలో పత్తి పంట ఎక్కువగా వేశారని, ఇటీవల కురిసిన వర్షాల వల్ల పత్తి పంట దెబ్బతిని దిగుబడి తగ్గిందని తెలియజేశారు. పత్తి పంటకు క్వింటాలుకు సిసిఎస్ కనీస మద్దతు ధర రూ. 8,110 ప్రకటించిందని అయితే తేమశాతం పేరుతో క్వింటాలుకు ?3,000 నుండి 4000 రూపాయలు వరకు దళారీలకు అమ్ముకునే పరిస్థితి రైతులకు దాపరించటం అన్యాయమని వారు పేర్కొన్నారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ రైతులు తెచ్చిన పత్తిని పూర్తిగా కొనుగోలు చేయక వివిధ కారణాలతో తిరిగి పంపించటం బాధాకరమని అన్నారు. వాహనాలలో తెచ్చిన పత్తి బాదుగలు కట్టలేక రైతులు కంటతడి పేడుతున్నారని అన్నారు. అలాగే పంట ఆన్లైన్ నమోదు వల్ల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ యాప్ ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ యాప్ నమోదు చేయడం కూడా రైతులకు కష్టంగా ఉందని తెలిపారు. గతంలో ఉల్లి మిరప పంటలకు కనీస మద్దతు ద్వారా ప్రకటించినప్పటికీ అది అమలు జరిగాక రైతుల ఉపశమనం కొరకు హెక్టారుకు 50వేల రూపాయలు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని

తెలియజేశారు. అయితే ఇప్పటివరకు రైతులకు డబ్బులు రైతుల అకౌంట్లో జమ కాలేదని తెలియజేశారు. కర్నూలు జిల్లాలో 55,700 ఎకరాలు ఉల్లి పంట 20,000 ఎకరాలు మొక్కజొన్న పంట దెబ్బతిన్నాయని అన్నారు. అకాల వర్షాల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్న ప్రభుత్వం కనీస మద్దతు ధర గాని లేదా ప్రభుత్వం ఇస్తామన్న ఆర్థిక సహాయం గానీ రైతులు రైతులకు అందకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులుకి అందవలసిన సహకారాన్ని అందించకపోతే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ ఒకటో తారీఖున కలెక్టర్, సబ్ కలెక్టర్ ఆదోని, ఎమ్మిగనూరు తాసిల్దారుల కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు పి. గోవిందు, రైతు సంఘం నాయకులు యు. లక్ష్మీ నరసయ్య, ఎం. అబ్దుల్లా, యాప్. రాఘవరెడ్డి, బి. రాజు, నామాల రాముడు పాల్గొన్నారు.

# అనుమానితులపై, రౌడీషీటర్లపై నిఘా ఉంచండి! డిఎస్పి బాబు ప్రసాద్.

**ఉత్తేజిత న్యూస్ సి.బెళగల్ నవంబర్ 29**



వార్షిక తనిఖీలో భాగంగా కర్నూలు డిఎస్పి జె.బాబు ప్రసాద్,సి.బెళగల్ పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసారు.ముందుగా సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించి,స్టేషన్ పరిసరాలన్నీ పరిశీలించి, స్టేషన్లో ఉన్న రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.పెండింగ్లో ఉన్న కేసులను వివరంగా పరిశీలించి, తగు సూచనలు ఇచ్చారు.రిసెప్షన్ కౌంటర్ నందు నిర్వహించబడుతున్న పిటిషన్ రిజిస్టర్ ను పరిశీలించి, వాటిని ఆన్లైన్లో చేయమని ఆదేశాలు ఇచ్చారు.స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లు మరియు సస్పెక్ట్స్ గురించి ఆరాతీసి వారిపై ప్రత్యేక నిఘా ఉంచమని ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో కోడుమూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ తబ్రెజ్, సిసి జయంత్,ఎస్సై వేణుగోపాల్ రాజు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుద్ధ కార్మికుల కుటుంబాలను పట్టించుకోని మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్య ధోరణి కండనీయం :- బహుజన సేన సమితి రాష్ట్ర అధ్యక్షులు :- గడ్డం నాగేంద్ర

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు నవంబర్ 29 శనివారం టౌన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట లిసిపిఐ పార్టీ ప్రధాన కార్యదర్శి జి రంగన్న మరియు ఏఐటీయూసీ తిమ్మ గురుడు మరియు ఐ ఎఫ్ టి యు నాయకులు ప్రసాద్ గారి ఆధ్వర్యంలో గత 13 రోజులుగా చనిపోయిన పారిశుద్ధ కార్మికుల భార్యలు కారుణ్య నియామకాల కోసం నిరాహార దీక్ష చేస్తూ ఉన్న పరిస్థితిని స్వయంగా పరిశీలించిన లిబహుజన సేన సమితి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ గడ్డం నాగేంద్ర గారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ౹**

"జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి వాటిని పట్టించుకోకుండా లిబాధిత కుటుంబాలను రోడ్ల మీద పడేయడం పూర్తిగా అన్యాయం. కష్టాల్లో ఉన్న కార్మికుల కుటుంబాలను ఇలా అవమానించడం ప్రభుత్వ యంత్రాంగానికి మచ్చ అని కఠినంగా వ్యాఖ్యానించారు.

**అలాగే ఆయన**

" పారిశుద్ధ కార్మికులు మన పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రాణాలు పెట్టి పనిచేస్తారు వారి కుటుం బాలను పట్టించుకోకపోవడం మన లిసమాజానికి సిగ్గు వెంటనే కారుణ్య నియామకాల ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలి. లేనిపక్షంలో మున్సిపల్ కమిషనర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తాం."

**గడ్డం నాగేంద్ర కొత్త అంశాలను స్పష్టం చేస్తూ పేర్కొన్నారు.**

దీక్ష చేస్తున్న మహిళల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించడానికి ప్రభుత్వం వెంటనే లివైద్య బృందాన్ని పంపాలి.ఉద్యోగ నియామకాలపై మున్సిపల్ కమిషనర్ తీసుకున్న ఆలస్య నిర్ణయాలన్నింటిని పౌరులకు తెలపాలి.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలకు ఒకటే విజ్ఞప్తి చేశారు రాష్ట్రంలో అన్నీ కారుణ్య నియామకాల పెండింగ్ కేసులను జిల్లా స్థాయిలో తక్షణమే పరిశీలించే,కమిటీ ఏర్పాటుకు డిమాండ్ చేశారుఈ కార్యక్రమంలో లిబాధిత కుటుంబాలు, కార్మిక సంఘాల ప్రతినిధులు, స్థానిక వివిధ హక్కుల సంఘాలు పాల్గొన్నాయి.

# కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై స్పందించి. ఘటన స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే బీవీ

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు నవంబర్ 29 శనివారం కోటికల్ దగ్గర గోరం రోడ్డు ప్రమాదం ఘటనా స్థలానికి చేరుకున్న ఎమ్మెల్య ఎమ్మెల్యే డాక్టర్ బీవి జయనాగేశ్వర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద స్థలాన్ని చేరుకుని ఘటనను స్వయంగా పర్యవేక్షించిన ఎమ్మిగనూరు శాసన సభ్యులు డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి , అక్కడి పరిస్థితులను స్థానికులతో, అధికారులతో తెలుసుకున్నారు.రోడ్డు ప్రమాదం పై సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి , ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణం మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.రెండు కార్లు ఢీకొన్న ఈ భయానక ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులతో సహా ఐదుగురు మృతి చెందడం ఎంతో బాధాకరమని ఎమ్మెల్యే డాక్టర్ బీవి జయనాగేశ్వర్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు.మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు.

# ప్రాథమిక వైద్యశాలను,అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్డిఓ

**తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:**



మండల కేంద్రమైన తుగ్గలి లో గల తుగ్గలి ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలను, అంగన్వాడి కేంద్రాన్ని పత్తికొండ ఆర్డిఓ భరత్ నాయక్ శనివారం రోజున తనిఖీ చేశారు.తుగ్గలి లోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం నందు సమావేశం అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఈ తనిఖీలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి వైద్యుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా ప్రభుత్వ ఉచిత మందుల గదిని,రక్త పరీక్ష నమూనా కేంద్రాన్ని, వ్యాక్సినేషన్ గదులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.వైద్యులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే మెరుగైన సేవలందించాలని తెలియజేశారు. అనంతరం తుగ్గలి లోని బీసీ కాలనీలో గల అంగన్వాడి కేంద్రం 2ను పరిశీలించారు.గర్భవతులకు, బాలింతలకు మరియు చిన్నారులకు ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుగ్గలి తహసిల్దార్ రవి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటరాముడు, మెడికల్ ఆఫీసర్లు రోజా రమణి,అమర్నాథ్, ఫారం సిస్టర్ రమేష్,ల్యాబ్ టెక్నీషియన్ మౌలాలి, ప్రాథమిక వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వడం లేదని

**మెప్మా ఆర్పీలు చాలీచాలని వేతనాలతో జీవనం చేయుచున్నారని ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఆర్పి ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వడం లేదని కేవలం ఎనిమిది వేల రూపాయలు ఇస్తున్నారని ఇచ్చే వేతనం కూడా ప్రతినెల ఇవ్వడం లేదని ఆర్పీల ఉద్యోగుల సంఘం సిఐటియు మండల కార్యదర్శి బి రాముడు**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిది**



. ఎమ్మిగనూరు నవంబర్ 29 శనివారం ఎమ్మిగనూరు మెప్మా సి ఎం ఎం జయవర్ధన్ గారికి డిమాండ్ల పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పి రాముడు మాట్లాడుతూ ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పొదుపు మహిళలను ఐక్యపరిచి ఆర్థిక స్వలంబన కొరకు అలాగే మహిళల జీవన ప్రమాణాలు ఆర్థికపరమైన పెరుగుదలకు పనిచేయుచున్న ఆర్పీ ఉద్యోగులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరి పట్ల వివక్షత చూపిస్తున్నారని వీరి యొక్క వేతనాలు పెంచడంలో పెండింగ్ వేతనాలు ఇవ్వటంలో నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని వీరికి రావలసిన పెండింగ్ వేతనాలు ఇవ్వాలని గ్రేడింగ్ విధానం రద్దు చేయాలని ఆర్పీలకు బ్యాంకు అకౌంట్లో వేతనాలు వేయాలని హెచ్ఆర్ పాలిష్ అమలు చేయాలని అభయహస్తం కట్టించుకున్న వారికి డబ్బులు వాపాస్ ఇవ్వాలని మరియు 45 సంవత్సరముల దాటిన పొదుపు మహిళలకు ప్రతినెల 2000 రూపాయలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని అలాగే శ్రీనిధి డిపాజిట్ కింద వసూలు చేసి బ్యాంకు నందు ఉన్న సొమ్ముని సభ్యులకు ఇవ్వాలని అలాగే పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని యూనిఫారం ఇవ్వాలని తదితర డిమాండ్లపై పరిష్కారం కొరకు డిసెంబర్ 1న కర్నూల్ కలెక్టర్ ఆఫీస్ ముందు మెప్మా ఆర్పీలు ఉద్యోగుల ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు మరియు ఆర్పీ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు

# మెప్మా ఆర్పీలు చాలీచాలని వేతనాలతో జీవనం

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

**మెప్మా ఆర్పీలు చాలీచాలని వేతనాలతో జీవనం చేయుచున్నారని ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఆర్పి ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వడం లేదని కేవలం ఎనిమిది వేల రూపాయలు ఇస్తున్నారని ఇచ్చే వేతనం కూడా ప్రతినెల ఇవ్వడం లేదని ఆర్పీల ఉద్యోగుల సంఘం సిఐటియు మండల కార్యదర్శి బి రాముడు**

ఎమ్మిగనూరు నవంబర్ 29 శనివారం ఎమ్మిగనూరు మెప్మా సి ఎం ఎం జయవర్ధన్ గారికి డిమాండ్ల పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పి రాముడు మాట్లాడుతూ ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పొదుపు మహిళలను ఐక్యపరిచి ఆర్థిక స్వలంబన కొరకు అలాగే మహిళల జీవన ప్రమాణాలు ఆర్థికపరమైన పెరుగుదలకు పనిచేయుచున్న ఆర్పీ ఉద్యోగులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరి పట్ల వివక్షత చూపిస్తున్నారని వీరి యొక్క వేతనాలు పెంచడంలో పెండింగ్ వేతనాలు ఇవ్వటంలో నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని వీరికి రావలసిన పెండింగ్ వేతనాలు ఇవ్వాలని గ్రేడింగ్ విధానం రద్దు చేయాలని ఆర్పీలకు బ్యాంకు అకౌంట్లో వేతనాలు వేయాలని హెచ్ఆర్ పాలిష్ అమలు చేయాలని అభయహస్తం కట్టించుకున్న వారికి డబ్బులు వాపాస్ ఇవ్వాలని మరియు 45 సంవత్సరముల దాటిన పొదుపు మహిళలకు ప్రతినెల 2000 రూపాయలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని అలాగే శ్రీనిధి డిపాజిట్ కింద వసూలు చేసి బ్యాంకు నందు ఉన్న సొమ్ముని సభ్యులకు ఇవ్వాలని అలాగే పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని యూనిఫారం ఇవ్వాలని తదితర డిమాండ్లపై పరిష్కారం కొరకు డిసెంబర్ 1న కర్నూల్ కలెక్టర్ ఆఫీస్ ముందు మెప్మా ఆర్పీలు ఉద్యోగుల ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు మరియు ఆర్పీ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలి.

ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య.



**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, నవంబర్29**

నగరంలో భవన నిర్మాణాలకు నగరపాలక సంస్థ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు సూచించారు. శనివారం ఉదయం నగరంలోని భూపాల్ హౌసింగ్ కాలనీ, కూరపాటి లేవుట్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలసి కమిషనర్ పర్యటించారు. తమ ప్రాంతంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, పార్కు అభివృద్ధి చేయాలని స్థానికులు కోరారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న భవన నిర్మాణాలను పరిశీలించాలని, తప్పనిసరిగా అనుమతులు ఉండాలని తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగితే సంబందించిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుక్కల లేకుండా చర్యలు చేపట్టాలని వెటర్నరీ ఆఫీసర్ ను ఆదేశించారు. భూపాల్ హౌసింగ్ కాలనీ లో డ్రైనేజి కాలువల నిర్మాణానికి, పార్కు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య , మున్సిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ లు వెంకట ప్రసాద్, శిల్ప, ఏసిపి మూర్తి, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

# కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయిలో పేదలకు వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం

రాష్ట్ర పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్

**కర్నూలు , నవంబర్ 29:-**

కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయిలో పేదలకు వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం అని, ఆ మేరకు ఆస్పత్రిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్తామని మంత్రి టి.జి.భరత్ తెలిపారు.శనివారం ఉదయం సర్వజన ఆసుపత్రిలో రూపాయలు 41 లక్షలు ఖర్చుతో ఆధునీకరించిన 4 గదుల పేయింగ్ బ్లాక్ ను పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ప్రారంభించారు. అనంతరం మంత్రి టి.జి.భరత్ మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ... కర్నూలు సర్వజన ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని, ప్రస్తుతం పేయింగ్ బ్లాక్ లో నాలుగు గదుల సముదాయాన్ని ఆధునికరించి ప్రారంభించామని , ఇందులో ఒకటి సూట్ రూము, మిగిలినవి మూడు ఏసీ గదులని , ఇవి కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో ఉన్నాయని, డబ్బులు చెల్లించి వినియోగించుకునే వారికి సౌకర్యంగా ఉంటాయని తెలిపారు.ఇంకా ఆస్పత్రిలో అవసరం మేరకు వివిధ విభాగాల్లో ఆధునిక పేయింగ్ బ్లాకులను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజ్ నుండి ఎంతోమంది ప్రఖ్యాత డాక్టర్లుగా దేశ విదేశాల్లో సేవలు చేస్తున్నారని తెలిపారు. వారి సలహాలు మరియు ప్రముఖ డాక్టర్లను ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో తీసుకొని వారి సూచనల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఈ ఆసుపత్రిలో ప్రముఖ వైద్యులు సేవలు అందిస్తూ ఉన్నందున మరియు మంచి సౌకర్యాలు ఉన్నందున ప్రక్క నున్న రాష్ట్రాల నుండి జిల్లాల నుండి వైద్య సేవలు పొందడానికి వస్తూ ఉంటారని వారికి అన్ని సేవలు ఇక్కడ లభిస్తాయని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రెండు మూడు టర్మ్ లు పనిచేయగలిగితే గుజరాత్ ప్రభుత్వం లాగా ఆంధ్రప్రదేశ్ కూడా గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి మాట్లాడుతూ... నూతన పేయింగ్ బ్లాక్ మంత్రి అందించిన రూ. 41 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో అందుబాటులోకి రావడం శుభ పరిణామం అని, ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు ఉండటం వలన వీటిని ఐసీయూ లాగా కూడా వినియోగించుకోవచ్చని, డబ్బులు చెల్లించ గల వారికి అందుబాటులో ఉండే విధంగా చార్జెస్ ఉంటాయని తెలిపారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు...మాట్లాడుతూ ప్లేయింగ్ బ్లాక్ విషయం మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లిన వెంటనే సానుకూలంగా స్పందించి తమ టి.జి.వి సంస్థ నుండి సిఎస్ఆర్ ఫండ్స్ రూపంలో రూ 41 లక్షల నిధులు అందించి ప్రస్తుతం ఈ బ్లాక్ ఏర్పడడానికి మంత్రి భరత్ కారకులయ్యారని , మూడు నెలల లోపల ఈ పనులు పూర్తయ్యాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ , డిప్యూటీ సూపరిండెంట్ లక్ష్మీబాయి, సి ఎస్ ఆర్ ఎమ్ పద్మజ , ఆర్ ఎం ఓ వెంకటరత్నం ,డి సి హెచ్ ఎస్ జఫ్రుల్లా, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ ప్రవీణ్ , రఘునాథ్ రెడ్డి , జగదీష్ , ప్రదీప్ , ఏపీఎంఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవి, వారి సిబ్బంది పాల్గొన్నారు.



# అభివృద్ధి పనుల్లో జాప్యం తగదు

**నగరపాలక అధికారుల సమీక్షలో మంత్రి టీజీ భరత్**

**రహదారుల విస్తరణ పనులు మరింత వేగవంతం చేయండి**

**పిపిపి పద్ధతిలో ఎగ్జిబిషన్ గ్రౌండ్ అభివృద్ధికి ప్రతిపాదనలు**





నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, టెండర్ల ద్వారా పనులు పొందినప్పటికీ ప్రారంభించని గుత్తేదారులపై తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ.భరత్ అధికారులకు ఆదేశించారు. శనివారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి నగరపాలక అధికారులతో సమావేశం నిర్వహించారు.ముందుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్, సంబర్ స్టోరేజ్ ట్యాంకు సమీపంలోని 129 ఎకరాల్లో పిపిపి ప్రాజెక్టుల ద్వారా నగర ప్రజలకు అధునాతన సౌకర్యాలు, కార్పొరేషన్‌కి ఆదాయం వచ్చేలా రూపకల్పన చేసిన ప్రతిపాదనలను పవర్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రికి ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ ప్రతినిధులు వివరించారు.తాగునీటి సరఫరా మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, గుత్తేదారుల సమస్యలు పరిష్కరిస్తూనే ఉన్నప్పటికీ జాప్యం జరుగుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు. అలసత్వం వహిస్తున్న గుత్తేదారులపై చర్యలు తీసుకోవడంలో ఉదాసీనత తగదని హితవు పలికారు. ఇతర శాఖలతో సమన్వయం పెంచుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జి వరకు రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలని, కల్లూరు దర్వాజ వద్ద బ్రిడ్జి పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. కార్పొరేషన్ ఆదాయం పెంపునకు కృషి చేయాలని, ఎల్ఆర్‌యస్, బిపియస్ పథకాలను ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..

నగరాన్ని స్మార్ట్ సిటిగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, నగర అభివృద్ధి విషయంలో ఏ అవకాశాన్నీ వదలకుండా ప్రగతిని సాధించేందుకు కృషి

చేస్తున్నట్టు తెలిపారు. పిపిపి పద్దతిలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ను ఆకర్షణీయంగా, అధునాతన సాంకేతిక అంశాలతో ఆహ్లాదకర వాతావరణంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. సంబర్ స్టోరేజ్ ట్యాంకు సమీపంలోని 129 ఎకరాల అభివృద్ధికి ఐకానిక్ టవర్, భవన సముదాయాల ఏర్పాటు వంటి అంశాలతో మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు వివరించారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ ఎన్.చిన్న రాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఇంచార్జ్ సీపీ బి.వెంకటరమణ, ఆర్‌ఓ జునైద్, ఎంఈ మనోహర్ రెడ్డి, ఏపీయస్‌పిడిసిఎల్ ఎస్ఈ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపిన శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, నవంబర్29**



తిరుపతి నగరంలో జాతీయ స్థాయి క్రీడా మౌలిక వసతుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తిరుపతి దామినేడు ప్రాంతంలో 28 ఎకరాల భూమిని స్పోర్ట్స్ సిటీ కోసం ఆమోదం తెలిపింది.తిరుపతిని క్రీడా హబ్‌గా అభివృద్ధి చేయాలని శాప్ చైర్మన్ రవి నాయుడు చేసిన అభ్యర్థన మేరకు గతంలో తిరుపతి జిల్లా కలెక్టర్ గారు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధిత ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు ఆమోదం లభించడంతో, ఈ రోజు శాప్ చైర్మన్ రవి నాయుడు గారి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డి.ఎస్.డి.ఓ, కోచులు మరియు సిబ్బంది కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ S. వెంకటేశ్వర్ IAS గారిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ'తిరుపతిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్ గారు చూపిస్తున్న కృషి ప్రశంసనీయం. రానున్న రోజుల్లో దక్షిణ భారతదేశానికి తిరుపతి ప్రముఖ క్రీడా కేంద్రంగా అవతరించనుంది" అని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో తిరుపతి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నరసింహ యాదవ్ గారు పాల్గొన్నారు

# అందరికీ నమస్కారం.



రేపు అనగా (30-11-2025) తేదీన ఉదయం 09:30 గంటలకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠ గారు ఎమ్మిగనూరు లో ఉన్న కర్నూల్ పార్లమెంట్ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు అందుబాటులో ఉంటారు.కావున వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నాయకులు,కార్యకర్తలు మరియు అభిమానులు గమనించగలరు. ఇట్లువైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎమ్మిగనూరు శిల్పా ఎస్టేట్ ఎమ్మిగనూరు.

# డిసెంబర్ 5వ తేదీన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ నిర్వహణ

**ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు మధ్య బంధం బలపరచడమే మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ ముఖ్య ఉద్దేశ్యం**

జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు, నవంబర్ 29: ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 5 వ తేదీన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ ను నిర్వహించడం జరుగుతోందని, మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ కు విద్యార్థులు, తల్లితండ్రులు హాజరై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు.శనివారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో మెగా PTM (పేరెంట్ టీచర్స్ మీటింగ్) 3.0 అంశంపై జిల్లా కలెక్టర్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు..ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ 3.0 డిసెంబర్ 5 వ తేదీన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు అన్నీ కలిపి మొత్తం 1468 పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో జరగబోతుందన్నారు.... ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులను, తల్లి తండ్రులను , పూర్వ విద్యార్థులను, సామాజిక కార్యకర్తలకు, దాతలను ఆహ్వానిస్తున్నామన్నారు... ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు మధ్య బంధం బలపరచడమే మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు...ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడే వేదిక ఈ కార్యక్రమం అని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు, వారి మానసిక వికాసం ఎలా ఉంది, ఎక్కడ బలహీనంగా ఉన్నారు, స్పోర్ట్స్ లో ఎలా ఉన్నారు, ఏ విషయాలలో బాగా సపోర్ట్ చేస్తే పైకి వచ్చే అవకాశం ఉంటుందనే విషయాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు తెలియచేయడంతో పాటు విద్యార్థులకు సంబంధించిన విషయాలను తల్లితండ్రుల నుండి తెలుసుకుని పరస్పరం విద్యాభివృద్ధి కి కృషి చేసే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. విద్యార్థుల ప్రగతి, ప్రవర్తనపై చర్చ జరుగుతుందన్నారు. తల్లిదండ్రులకు హొలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందచేసి విద్యార్థుల హాజరు, మార్కుకు, ఆరోగ్య వివరాలను అందచేయడం జరుగుతుందన్నారు. స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఉంటాయని, కిట్ కు, సైన్స్ ప్రాజెక్టుల వంటి ఎగ్జిబిషన్ ల ప్రదర్శనలు ఉంటాయన్నారు.. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు 13 రకాల కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు .డిసెంబర్ 5 వ తేదిన ఉదయం 9 గంటలకు మెగా పేరెంట్స్ టీచర్ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా అమ్మాయిలు సెల్ఫ్ డిఫెన్స్ ఎలా చేసుకోవాలనే అంశం మీద అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో డ్రాప్ ఔట్ శాతం ఎక్కువగా ఉందని, వాటిని తగ్గించేందుకు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడి డ్రాప్ ఔట్ శాతం తగ్గించాలని సూచించమన్నారు. అదే విధంగా బాల్య వివాహాలు చేస్తే ఎటువంటి సమస్యలు తలెత్తుతాయి అనే విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించామన్నారు. ముఖ్యంగా 7, 8, 9 వ తరగతి విద్యార్థులకు బాల్య వివాహాల పై, సెల్ఫ్ డిఫెన్స్, గుడ్ టచ్ , బ్యాడ్ టచ్ ల మీద పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని హెడ్ మాస్టర్ లకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.. ప్రతి పాఠశాలల్లో ఒక మహిళా ఉపాధ్యాయురాలిని నోడల్ అధికారిగా నియమించాలని, ఇళ్లలో పిల్లలకు పెళ్లి విషయం గురించి చర్చిస్తున్నట్లయితే, ఆ విషయాన్ని నోడల్ అధికారికి చెప్పే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు .. డ్రాప్ ఔట్ తగ్గడంతో పాటు 10 వ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు..

డిసెంబర్ 5వ తేదీ నాటికి పదవ తరగతి సిలబస్ పూర్తి అవగానే 10 వ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా 100 రోజుల ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. 10 వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, సాయంత్రం సమయంలో స్నాక్స్ ఏర్పాటు చేసి, ఎక్కువ సేపు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు..అంతకు ముందు కలెక్టర్ ఎమ్ఈఓ, హెడ్ మాస్టర్ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ ను విజయవంతం చేయాలని దిశా నిర్దేశం చేశారు..ప్రెస్ కాన్ఫరెన్స్ లో జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్, సమగ్ర శిక్ష పిఓ లోక్ నాథ్ పాల్గొన్నారు...

# రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న

:ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు నవంబర్ 29:**



నందికొట్కూరు నియోజకవర్గం మిడ్తూర్ మండలంరైతుల ఆదాయాన్ని పెంచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న "రైతన్న మీకోసం" కార్యక్రమంలో రోల్లపాడు గ్రామంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య రైతులు, రైతు నాయకులు మరియు కూటమి నేతలతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, సాగునీటి సదుపాయాలు, ఎరువుల లభ్యత, పంటల మార్కెటింగ్, మద్దతు ధర వంటి అంశాలపై వివరాలు సేకరించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఆధునిక సాగు పద్ధతులు అవలంబిస్తూ దిగుబడులను పెంచుకునే దిశగా ముందడుగు వేయాలని సూచించారు.రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం, శిక్షణ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రతి రైతుకూ చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు మరింత ఉత్సాహంతో సాగు పనులు చేపట్టేందుకు ప్రోత్సాహం లభించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో: కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ శివరామి రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ రాజశేఖర్ రెడ్డి, స్వామి రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ సర్వోత్తం రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సుధాకర్ యాదవ్, యూనిట్ ఇంచార్జ్ నాగేంద్ర, వీరారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అయ్యన్న, వెంకటేశ్వర్ రెడ్డి, నాగేశ్వరావు, మాదిరెడ్డి, కడుమూరు సుధాకర్ రెడ్డి,

రాంభూపాల్ రెడ్డి, నరసింహ గౌడ్,ఇడమకంటి మోరళీధర్ రెడ్డి, రమణారెడ్డి, సోఫిసాహెబ్, గుడిపాడు మహేష్, గ్రామ మరియు మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు టిడిపి నాయకులు అగ్రికల్చర్ అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెంటనే వరిధాన్యం సేకరించాలి

**కోత మిషన్లు అందుబాటులోకి తేవాలి**

**కౌలురైతు సంఘం నేతల డిమాండ్**



అమరావతి: రైతుల నుంచి ధాన్యాన్ని వెంటనే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. వరి పండే ప్రాంతాల్లో కోతలు చేపట్టేందుకు కోత మిషన్లు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెరిగిన పెట్టుబడులు, మొంథా తుపాను కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ధాన్యాన్ని నూర్పిడి చేస్తే, 22 శాతం వరకూ తేమ ఉన్నందున ఇంకా ఆరబెట్టాలని రైతు సేవా కేంద్రం సిబ్బంది వెనక్కి పంపుతున్నారని చెప్పారు. ప్రభుత్వ ప్రకటనలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేదన్నారు. ధాన్యంలో తేమ 22 శాతం ఉంటే మిల్లర్లతో మాట్లాడుకోవాలని, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు, కాటా కూలీ రైతే భరించాలని కొందరు సిబ్బంది ఒత్తిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సంచులు కూడా అందుబాటులో లేవన్నారు. ఒకవైపు వాతావరణం, మరోవైపు ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగడం వల్ల రైతులు తమ ధాన్యాన్ని తెగనమ్ముకోవాల్సి వస్తుందని వెల్లడించారు. దీంతో మిల్లర్లు రూ.1,770 చెల్లించాల్సిన బస్తాకు రూ.1,300 నుంచి రూ.1,400 మాత్రమే రైతులకు చెల్లిస్తున్నారని తెలిపారు. రైతులను దళారులు ఈ విధంగా దోపిడీ చేస్తున్నా అధికార యంత్రాంగం నిద్ర నటిస్తుందన్నారు. పర్యటనలు, ప్రకటనలు చేస్తే రైతాంగానికి ఊరట కలగదని, తేమ శాతం ఎక్కువగా ఉన్నా నిబంధనలు సడలించి కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తిరుమలలో పర్యావరణకు పెద్దపీట

**త్వరలోనే విద్యుత్ వాహనాలకు అనుమతి**

**అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి**

తిరుపతి: తిరుమల పవిత్రతను కాపాడడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై తితిదే దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే పాత డీజిల్, పెట్రోల్ వాహనాల స్థానంలో విద్యుత్ వాహనాలు వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు దేవస్థానం అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు తిరుమలను సంపూర్ణ కాలుష్య రహిత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే అనేక చర్యలు చేపట్టామని తెలిపారు. తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి భవనంలో శుక్రవారం కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ సీనియర్ కన్‌స్టలెంట్ ప్రతినిధులు, ఆర్టీసీ, తితిదే అధికారులతో వెంకయ్య చౌదరి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటిగా తిరుపతి – తిరుమల మధ్య పూర్తి స్థాయిలో విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుమలలో నడిచే ట్యాక్సీలు ఇతర అద్దె వాహనాలను విద్యుత్ వాహనాలతో దశలవారీగా భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా దిల్లీకి చెందిన సీనియర్ కన్‌స్టలెంట్ ప్రతినిధి కునాల్ జోషి వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనిపై పూర్తి స్థాయి నివేదికను అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. త్వరలో జరగనున్న తితిదే పాలకమండలి సమావేశంలో ఈ అంశంపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోనున్నట్లు వెంకయ్య చౌదరి తెలిపారు. ఈ సమావేశంలో తితిదే డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, విజివో సురేంద్ర, ఐటీ డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లునాయుడు, రాష్ట్ర రవాణాశాఖ, ఆర్టీసీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# సిసిఐ పత్తి కొనుగోళ్లలో నిర్లక్ష్యం

**అధికారుల తీరుకు నిరసనగా రైతుల ఆందోళన**

నంద్యాల: నంద్యాల జిల్లా కేంద్రంలోని మురారి కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతుసంఘం నేతలు ఆరోపించారు. నాణ్యత ప్రమాణాల పేరుతో గత రెండు రోజుల నుండి పత్తి కొనుగోలు చేయకుండా రైతుల్ని ఇబ్బంది పెడుతున్నారు. దీంతో రైతులు ఆగ్రహించి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిపిఎం పార్టీ నాయకులను కలిశారు. విషయం తెలుసుకున్న నాయకులు సీసీఐ కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఉదయం నుండి సీసీ ఐ అధికారులను బయటికి వెళ్ళనివ్వకుండా లోపలనే అడ్డగించి, ఎలాంటి షరతులు లేకుండా, కొనుగోలు కేంద్రానికి తెచ్చిన మొత్తం పత్తిని రైతుల నుండి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి, రమేష్ కు మార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి .రామచంద్రుడు, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, సిపిఎం జిల్లా నాయకులు నరసింహ నాయక్, వి .బాల వెంకట్, పి.నరసింహ, కృష్ణ తదితరులు రైతులకు అండగా నిలబడి రైతులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా టి.రమేష్ కుమార్, టి. రామచంద్రుడులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పత్తి కొనుగోలు కోసం పెట్టిన షరతుల వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతున్నదని, స్లాట్ బుకింగ్ పేరుతో పది రోజులు కాలయాపన జరిగిందని తీరా కొనుగోలు కేంద్రాలకు పత్తిని తెచ్చిన తర్వాత నాణ్యత పేరుతో అధికారులు వెహికల్స్ వెనక్కి తిప్పి పంపడం దుర్మార్గమైన చర్య అన్నారు. సిసిఐ అధికారులు మధ్య దళారులు ఇచ్చే కమిషన్లకు ఆశపడి

నాణ్యతగా ఉన్న పత్తిని కూడా బాగోలేదంటూ రిజెక్ట్ చేస్తుండడం దుర్మర్గమైనచర్యగా అభివర్ణించారు. సుదూర ప్రాంతాల నుంచి కొనుగోలు కేంద్రంకు వచ్చిన వెహికల్ బాడుగలు, భోజనం ఖర్చులు, లోడింగ్ అన్లోడింగ్ ఖర్చులు, వీటన్నిటితో పాటు స్లాబుల పేరుతో రేటులో మోసం ఫలితంగా రై తాంగం తీవ్రంగా నష్టాల పాలవుతున్నారన్నారు.కేంద్ర ప్రభుత్వం పత్తి కొనుగోలు నిబంధనలను సడలించాలని, సిసిఐ పెట్టే నిబంధనలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని కేంద్రంతో మాట్లాడి రద్దు చేయించాలని, రైతాంగం పండించిన మొత్తం పత్తిని మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోని రైతు సేవ కేంద్రం ఉపయోగించుకొని స్లాట్ బుకింగ్ సమయంలోనే నాణ్యతను పరిశీలించి అక్కడే రైతులకు అర్థమయ్యేలా చెప్పి పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద కు పత్తి రైతులు తీసుకొని వెహికల్స్ వెళ్లాలా లేదా వంటి నిర్ణయాన్ని సిసిఐ అధికారులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. చాలా సమయం వరకు అధికారులు రైతులు పట్టు విడవకుండా సమస్య పరిష్కారం అయ్యేవరకు వెళ్లే ప్రసక్తి లేదని కూర్చోవడంతో చివరకు అధికారులు జోక్యం చేసుకొని వెంటనే కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. చివరకు అధికారులకు కూడా రైతుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని వెంటనే సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, ఓర్వకల్, డోన్, క్రిష్ణగిరి మండలాల ప్రత్తి రైతులు ఉన్నారు.

# టిటిడి పరకామణి కేసు

**సిఐడి విచారణకు వైవి సుబ్బారెడ్డి హాజరు**

విజయవాడ: పరకామణి కేసులో సీఐడీ విచారణకు మాజీ టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం విజయవాడలోని సీఐడీ కార్యాలయానికి హాజరయ్యారు. వైవీ సుబ్బారెడ్డిని అడిషనల్ డీజీ రవి శంకర్ అయ్యన్నర్ విచారించారు. రెండు గంటల పాటు విచారణ సాగగా.. వైవీ సుబ్బారెడ్డి స్టేట్‌మెంట్‌ను సీఐడీ అధికారులు రికార్డ్ చేశారు. రెండు రోజుల క్రితం టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి, సీవీఎస్‌వో నరసింహ కిషోర్‌లను సీఐడీ ప్రశ్నించిన విషయం తెలిసిందే. తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి కేసు డాక్యుమెంట్లను సీఐడీ కార్యాలయానికి అధికారులు తెప్పించుకున్నారు. డిసెంబర్ 2వ తేదీలోపు ఏపీ హైకోర్ట్‌లో కేసు నివేదికను సమర్పించాల్సి ఉంది. దీంతో ఈ కేసుకు సంబంధించి సీఐడీ కసరత్తు ముమ్మరం చేసింది. కాగా.. విచారణ అనంతరం వైవీ మీడియాతో మాట్లాడుతూ.. పరకామణి విషయంలో తనను సీఐడీ ప్రశ్నించిందని.. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పానని తెలిపారు. తన హయాంలో దొంగతనం జరిగిందని అడిగారని అన్నారు. తన పిరియడ్ అయ్యాక ఇది బయట పడిందని ఆయన తెలిపారు. ఆరోజు ఈ విషయం ఎవరు దాచారో తనకు తెలియదని చెప్పుకొచ్చారు. ఈ విచారణను రాజకీయ కోణంలో చూడవద్దని విజ్ఞప్తి చేశారు. టీటీడీ లడ్డూ, పరకామణి విషయంలో దోషులుగా చూడొద్దన్నారు. నిష్పక్షపాతంగా

విచారణ చేసి దోషులను శిక్షించాలని కోరారు. విచారణకు అన్నివిధాలా సహకారం అందిస్తామని సీఐడీ అధికారులకు చెప్పామని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

# పంచాయితీ ఎన్నికలపై సిఎం ఫోకస్

**1నుంచి రేవంత్ జిల్లాల పర్యటన**



హైదరాబాద్: పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో సిఎం మరోమారు జిల్లాల్లో పర్యటించి పార్టీ అభ్యర్థలను గెలిపించేందుకు ప్రచారం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్ సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది. మొత్తం ఆరు రోజుల పాటు సీఎం జిల్లాల టూర్ కొనసాగనుంది. ఆరు రోజులు ఆరు జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటించనున్నారు. సీఎం రేవంత్ పర్యటన షెడ్యూల్ ఇలావుంటి. డిసెంబర్ 1న మహబూబ్ నగర్ జిల్లా మక్తల్, 2న ఖమ్మం జిల్లా కొత్తగూడెం, 3న కరీంనగర్ జిల్లా హుస్నాబాద్, 4న ఆదిలాబాద్, 5న నర్సంపేట, 6న నల్గొండ జిల్లా దేవరకొండలో పర్యటించనున్నారు. తెలంగాణలో త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. మొదటి విడత వచ్చే నెల డిసెంబర్ 11, రెండో విడత డిసెంబర్ 14, మూడో విడత డిసెంబర్ 17న ఉంటుంది. అయితే, ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన చేపట్టనున్నారని తెలుస్తోంది. తాజాగా, సీఎం రేవంత్ జిల్లాల పర్యటన ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది.

# అంబర్‌పేట ఎస్‌ఐ గన్ మిస్ కేసు

**కొనసాగుతున్న విచారణ**

హైదరాబాద్: అంబర్‌పేట్ ఎస్‌ఐ గన్ మిస్సింగ్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. గన్ మిస్సింగ్‌పై ఎస్‌ఐ భానుప్రకాష్ రెడ్డి పొంతనలేని సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కడ పెట్టానో గుర్తులేదు అంటూ సమాధానాలు ఇస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భాను ప్రకాష్ ఐదు నెలల క్రితమే గన్‌ను మిస్ చేశాడు. జర్నీలో ఎక్కడో బ్యాగ్ పోగొట్టుకున్నా అని చెబుతూ వచ్చాడు. అయితే గత ఐదు నెలల నుంచి గన్ మిస్ అయిన విషయాన్ని పై అధికారులకు చెప్పకుండా ఎస్‌ఐ దాచిపెట్టినట్లు తెలుస్తోంది. మరొక ఉద్యోగం రావడంతో ఏపీకి వెళ్లేందుకు ఎన్వోసీని ఎస్‌ఐ అడుగగా.. సర్వీస్ రివాల్వర్ ఇవ్వాలని వారు సూచించారు. దీంతో అసలు బండారం బయటపడింది. ఎస్‌ఐ భానుప్రకాష్ తన గన్‌ను మిస్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో అంబర్‌పేట్ పోలీసులు ఇన్వెస్టిగేషన్ కొనసాగుతోంది.రోవైపు పోలీసు శాఖకు మచ్చ తెచ్చే విధంగా ఎస్‌ఐ ప్రవర్తించినట్లు తెలుస్తోంది. బెట్టింగ్‌లను ఆపాల్సిన ఎస్‌ఐ.. విపరీతంగా బెట్టింగ్‌లు ఆడి లక్షలు పోగొట్టుకున్నట్లు సమాచారం. అంతే కాకుండా బెట్టింగ్ కోసం ఏకంగా తన పొలాన్నే అమ్ముకున్న వైనం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కడప జిల్లాలో ఉన్న రాయచోటిలో పొలాలను ఎస్‌ఐ అమ్ముకున్నాడు. దాదాపు రూ.96 లక్షలకు పైగా డబ్బులను ట్రాన్సాక్షన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

# ఢిల్లీ కాలుష్యంపై ప్రణాళిక ఏదీ

**మోడీపై మరోమారు రాహుల్ విమర్శలు**

**పార్లమెంటులో చర్చిస్తామని వెల్లడి**




న్యూఢిల్లీ:దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యం ముప్పు తిప్పలు పెడుతోంది. స్వచ్ఛమైన గాలి లేక నగర వాసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, పిల్లల పరిస్థితి అయితే మరీ దయనీయంగా మారింది. అనేక ఆరోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇక ప్రజలు బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ప్రస్తుతం వాతావరణం మరింత దారుణంగా తయారైంది.ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ఢిల్లీ వాసులు కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు. ఢిల్లీలో జీవించలేక పోతున్నామని వాపోయారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఢిల్లీలో అత్యవసర ఆరోగ్య పరిస్థితిని విధించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఢిల్లీ కాలుష్యంపై చర్చ జరగాల్సిందేనని కోరారు. నేను కలిసిన ప్రతి తల్లి నాకు ఒకటే చెప్పారు. బిడ్డలు విషపూరిత గాలిని పీల్చుకుంటున్నారని. నీరసించి పోవడమే కాకండా భయపడు తున్నారని చెప్పారు. ఆందోళనగా ఉంటున్నారని వాపోయారు. మోడీ జీ.. భారతదేశ పిల్లలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మీరెలా మౌనంగా ఉండగల్గుతున్నారు? మీ ప్రభుత్వానికి ఎందుకు అత్యవసర ప్రణాళిక లేదు. జవాబుదారీతనం లేదా? అంటూ రాహుల్ గాంధీ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితిని పరిష్కరించడానికి దేశానికి ఒక కార్యాచరణ ప్రణాళిక అవసరమన్నారు. మన పిల్లలు స్వచ్ఛమైన గాలికి అర్హులు– సాకులు, పరధ్యానాలు కాదని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చర్చ జరపాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. డిసెంబర్ 1 నుంచే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. నవంబర్ 30న ఆల్ పార్టీ మీటింగ్ జరగనుంది.

# అమరావతి నిర్మాణానికి రుణం

**రూ.7,500 కోట్ల రుణానికి ప్రభుత్వం ఆమోదం**

అమరావతి: రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం కోసం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అమరావతి కోసం రూ.7,500 కోట్ల రుణం తీసుకునేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎన్‌ఏబీఎఫ్ఐడీ నుంచి ఈ రుణం తీసుకునేందుకు ప్రభుత్వం ఆమోదించింది. తీసుకోనున్న రూ.7,500 కోట్ల రుణానికి హామీ ఇస్తూ ఉత్తర్వులు సైతం జారీ చేసింది. రాజధాని నిర్మాణం కోసం సీఆర్డీఏ కమిషనర్ పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ నిధులను రాజధాని అమరావతి అభివృద్ధికి ఖర్చు చేయాలని ప్రభుత్వం నిబంధన విధించింది. దీనిపై తదుపరి చర్యలు తీసుకోవాలని సీఆర్డీఏ కమిషనర్‌కు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను గురువారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ సురేశ్ కుమార్ జారీ చేశారు.

## డిప్యూటి సిఎం రాజోలు పర్యటనలో అపరిచత వ్యక్తి

అమరావతి:ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంలో ఒక అపరిచిత వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్‌కు చేరువలో సంచరించినట్లు తెలుస్తోంది. ఆ రోజు శంకరగుప్తం డ్రయిన్ మూలంగా దెబ్బతిన్న కొబ్బరి తోటలు పరిశీలిస్తున్న సమయంలో, అధికారులతో సంభాషిస్తున్న సందర్భంలో, ఆ తర్వాత కార్యక్రమంలో సదురు వ్యక్తి పవన్ కల్యాణ్‌కు సమీపంలో సంచరించారు. అతడు రాజోలు నియోజకవర్గం లోని వైకాపా కార్యకర్త అని డిప్యూటీ సీఎం కార్యాలయానికి సమాచారం అందింది. దీంతో అధికారులు అతని వ్యవహార శైలి, కదలికపై అనుమానం వ్యక్తం చేస్తూ.. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. అతడి కదలికలు, కార్యక్రమానికి జారీ చేసిన పాస్ అతడికి చేరడంపై సందేహాలను ఎస్పీకి వివరించారు. వెంటనే విచారణ చేపట్టి.. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## అధికారాలను హరించేదిగా కేంద్ర విత్తన బిల్లు

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను హరించే విధంగా కేంద్ర విత్తన బిల్లు ఉందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. కేందప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన ముసాయిదా బిల్లుపై మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు.. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీలో సెంట్రల్ డ్రాఫ్ట్ సీడ్స్ బిల్లు–2025 రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. విత్తన ముసాయిదా బిల్లుపై సర్టిఫికేషన్ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలను నియంత్రించాల ంటే రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకపోతే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. విత్తన ముసాయిదా బిల్లుపై అభ్యం తరాలు, సవరణలు రాష్ట్ర ప్రభుత్వం తరపున పంపాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. జిల్లాల వారీగా రైతు సమావేశాలు నిర్వహించి సంబంధిత అధికారులు అభిప్రాయ సేకరణ చేయాలని ఆదేశించారు. పంట నష్ట పరిహారం విషయంలో విత్తన ముసాయిదా బిల్లులో స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన కేంద్ర ముసాయిదా విత్తన బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు గట్టిగానే తెలుపుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.

## ప్రేమించిన యువతికి మరో యువకుడితో వివాహం

**ఆత్మహత్య చేసుకున్న ప్రేమికుడు**

నిజామాబాద్: ప్రేమించి మోసపోయానని గ్రహించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. నిజామాబాద్ జిల్లా దొంచందకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి.. ఏరుగట్లకు చెందిన ఓ యువతితో ఆరేళ్లుగా ప్రేమలో పడ్డారు. ఇరువురు ఎంతో అన్యోన్యంగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రీకాంత్‌రెడ్డి తాను ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకునేందుకు లండన్ నుంచి నిజామాబాద్ వచ్చారు. అయితే.. సదరు యువతి తల్లిదండ్రులు ఆమెకు మరో యువకుడితో పెళ్లి జరిపించారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీకాంత్‌రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు వెంటనే గుర్తించి ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శ్రీకాంత్‌రెడ్డి మృతిచెందారు. ఈ ఘటనతో శ్రీకాంత్ కుటుంబం.. నిజామాబాద్ పట్టణంలో మృతదేహంతో ఆందోళనకు దిగింది. ఇంతలో పోలీసులు వీరి ఆందోళనను అడ్డుకున్నారు. దీంతో శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. శ్రీకాంత్‌రెడ్డి మృతిపై నిజామాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని అతడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

# ఐసియూలో ఉన్న రాష్టరానికి కేంద్రం ఆక్సిజన్

**అమ్మలాగే ఆర్థిక మంత్రి అవసరం మేరకు కేటాయింపులు**

**చంద్రబాబు కారిన్యం కూడా అభివృద్ధికి దోహదం**

**ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి**

అమరావతి: రాజధాని బ్యాకుల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ..గత పాలకుల వల్ల ఐసీయూలో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రం ఆక్సిజన్ అందించిందన్నారు. దీనికి రాష్ట్ర ప్రజల తరపున కేంద్రానికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాం.బ్యాంకుల ప్రధాన కార్యాలయాలతో దేశ ఆర్థిక వ్యవస్థ అంతా ఏపీకి వచ్చినట్టు ఉంది. ఆర్థిక వనరుల విషయంలో ఆమె కాస్త కఠినంగానే ఉంటారు. మన ఇంట్లో అమ్మలాగే ఎప్పుడు ఏది అవసరమో, అప్పుడే నిధులు ఇస్తారు. ఇంత పెద్ద భారతదేశంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను నిర్వహించటం మాటలు కాదు. మా రాజకీయ హెడ్ మాస్టర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఫలితాలు సాధించే విషయంలో కఠినంగానే ఉంటారు. అందుకే ప్రతిఫలాలు ప్రజలకు అందిస్తున్నారని పయ్యావుల అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ కు

ఇంధనం–ధనమే. వందేభారత్ రైళ్లు, డిఫెన్స్ సెక్టార్, విద్య, వైద్య రంగాల్లో నిధుల కేటాయింపు పెరుగుతోంది.దేశం గుర్తు పెట్టుకునేలా కేంద్ర ఆర్థిక మంత్రి సేవలు అందిస్తున్నారు.జీఎస్టీ సంస్కరణల ప్రకటించినప్పుడు అత్యంత వేగంగా దానిని దేశవ్యాప్తంగా అమలు చేయటం ఆశ్చర్యపరిచింది.పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణానికి, విశాఖ ఉక్కుకు ఆర్థిక సహకారం కేంద్రం అందిస్తోందని

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు . కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ 8 మార్లు ఆర్థిక మంత్రిగా బ్జడెట్లు ప్రవేశపెట్టిన చరిత్ర సాధించారు నిర్మలా సీతారామన్. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను విలీనం చేసి ఖాయిలా ప్రమాదం నుంచి వాటిని కాపాడారు ఆమె. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వారికి నిర్మలాసీతారామన్ స్ఫూర్తి. 34 వేల ఎకరాలను రైతులు రాజధాని కోసం త్యాగం చేశారు. అమరావతి అంటే ఆంధ్రుల ఆత్మవిశ్వాసం, రాష్ట్ర భవిష్యత్ కల అన్నారు. రాజధానిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన చేసారు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ , ముఖ్యమంత్రి చంద్రబాబు. మొత్తం 15 బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన చేసారు.

# రుణం తిరిగి చెల్లించిన అంబానీ.. దూసుకెళ్తున్న రిలయన్స్ షేర్లు..



ఒకప్పుడు దిగ్గజ పారిశ్రామిక వేత్తల్లో ఒకరిగా ఉన్న అనిల్ అంబానీ.. తర్వాతి కాలంలో తన ప్రాభవాన్ని కోల్పోయారు. అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. ఈ క్రమంలోనే తన కంపెనీల షేర్లు కూడా కుదేలయ్యాయి. గరిష్ట స్థాయిల నుంచి దిగొచ్చాయి. అయితే ఇప్పుడు ఒక సానుకూల ప్రకటనతో షేర్లు దూసుకెళ్తున్నాయి. వరుసగా అప్పర్‌స ర్క్యూట్లు కొడుతుండటం విశేషం.
అనిల్ అంబానీ.. ఒకప్పుడు తన సోదరుడు ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, భారత్‌లోనే అత్యంత కుబేరుడు అయిన ముకేశ్ అంబానీ కంటే అత్యంత ధనవంతుడు. అయితే కాలం గడుస్తున్న కొద్దీ అనిల్ అంబానీ తన సంపద కోల్పోతూ వచ్చారు. బ్యాంకుల వద్ద అప్పులు ఎక్కువగా తీసుకొని వాటిని చెల్లించలేకపోయారు. వ్యాపారాల్లో నష్టాలు వచ్చాయి. దీంతో అంబానీ ఒక దశలో దివాలా తీసినట్లు స్వయంగా ప్రకటించారు. వేల కోట్లుగా ఉన్న ఆస్తులు వందల కోట్లకు చేరాయి. అనిల్ అంబానీకి ఇక ఇప్పుడు మంచి రోజులు వచ్చిన ట్లే కనిపిస్తోంది. ఇన్ని రోజులు మీడియాకు దూరంగా ఉన్న ఆయన కొద్ది రోజుల కిందట ముకేశ్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ ప్రీవెడ్డింగ్ కార్యక్రమంలో కనిపించారు.
తాజాగా అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ కంపెనీ.. ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, డీబీఎస్ బ్యాంకులకు చెల్లించాల్సిన రుణాల్ని సెటిల్ చేసినట్లు తెలిసింది. ఈ క్రమం లోనే రిలయన్స్ పవర్ షేర్లు ఇవాల్టి సెషన్‌లో దూసుకెళ్లాయి. ప్రస్తుతం వార్త రాసే సమయం లో దాదాపు 5 శాతం లాభంతో రూ. 23.90 వద్ద ఉంది. ఇక గత 5 రోజుల్లో చూసుకుంటే ఏకంగా 20 శాతానికిపైగా షేరు పుంజుకుంది. ఈ స్టాక్ ఏడాది వ్యవధిలోనే ఏకంగా 130 శాతానికిపైగా ఎగబాకింది.
రిలయన్స్ పవర్ స్టాక్ 52 వారాల గరిష్ట విలువ రూ. 33.15 కాగా.. కనిష్ట విలువ రూ. 9.05 గా ఉంది. గత నాలుగేళ్లలో ఈ స్టాక్ 2 వేల శాతానికిపైగా పెరిగింది. 2020 మార్చి 27న రూ.1.13 వద్ద ఉండగా.. ఇప్పుడు రూ. 23 లెవెల్‌కు చేరుకుంది. రిలయన్స్ పవర్ ఎంక్యాప్ ప్రస్తుతం రూ. 9.11 వేల కోట్లుగా ఉంది. మరోవైపు రిలయన్స్ పవర్ పేరెంట్ కంపెనీ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూడా జేసీ ఫ్లవర్స్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీకి రూ. 2100 కోట్ల మేర బకాయిలు ఉండగా.. దీనిని కూడా తిరిగి చెల్లించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆ స్టాక్ కూడా భారీగా పెరుగు తోంది. ఇవాళ 5 శాతాని కిపైగా పెరిగి ఇంట్రా డేలో రూ. 253.40 వద్ద గరిష్టాన్ని తాకింది. ఇది 5 రోజుల్లో 27 శాతా నికిపైగా పెరగడం విశేషం. 6 నెలల్లో 44 శాతానికిపైగా ఎగబాకిం ది. ఏడాదిలోనే 70 శాతం పుంజుకుంది. దీని మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 9.91 వేల కోట్లుగా ఉంది. ఇక రానున్న రోజుల్లో కూడా ఈ షేర్లు పెరిగే అవకాశాలే ఉన్నట్లు తెలుస్తోంది.

# క్రెడిట్ కార్డ్ బిల్లు కట్టలేకపోతున్నారా?




క్రెడిట్ కార్డుల వినియోగం ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోయిందని చెప్పొచ్చు. అత్యవసర సమయాల్లో ఇది చక్కగా ఉపయోగపడుతుంది. అయితే చాలా మంది క్రెడిట్ కార్డు బిల్లును సకాలంలో చెల్లించలేక ఇబ్బందులు పడుతుంటారు. వారి కోసం ఒక మంచి ఆప్షన్ ఉందని తెలుసా? అదే క్రెడిట్ కార్డ్ బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్. మరి ఇప్పుడు దీని గురించి తెలుసుకుందాం.
మీరు క్రెడిట్ కార్డు వాడుతున్నారా? మరి బిల్లు సకాలంలో చెల్లిస్తున్నారా? చాలా మంది ఈ రోజుల్లో క్రెడిట్ కార్డుల్ని ఎక్కువ వినియోగించి పరిమితికి మించి ఖర్చులు చేస్తున్నారు. ఇక దానిని గడువులోగా చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటప్పుడు ఆ బిల్లును ఇతర క్రెడిట్ కార్డుకు బదిలీ చేసుకోవచ్చని తెలుసా. క్రెడిట్ కార్డు చెల్లింపుల విషయంలో బ్యాలెన్స్ బదిలీ అనేది ఒక రక్షణ ఆయుధంగా పనిచేస్తుంది. ఇప్పుడు ఈ బ్యాలెన్స్ బదిలీ అంటే ఏంటో చూద్దాం. మీ దగ్గర రెండు క్రెడిట్ కార్డులు ఉన్నాయనుకుందాం. దాంట్లో మొదటి క్రెడిట్ కార్డుపై బిల్లు బకాయి ఉంది. అయితే మీరు బిల్లు చెల్లించడానికి నగదు లేకుంటే.. మొదటి క్రెడిట్ కార్డులోని బ్యాలెన్స్‌ను రెండో క్రెడిట్ కార్డుకు ట్రాన్స్‌ఫర్ చేసి కొన్నాళ్ల తర్వాత (బిల్లింగ్ సైకిల్ ప్రకారం) బిల్లు చెల్లించొచ్చు. క్రెడిట్ కార్డ్ బ్యాలెన్స్ బదిలీ కోసం నెట్ బ్యాంకింగ్ సహా ఆయా క్రెడిట్ కార్డుల కస్టమర్ కేర్‌ను సంప్రదించొచ్చు. క్రెడిట్ కార్డు బిల్లు సకాలంలో చెల్లించని పక్షంలో డిఫాల్ట్ అయ్యే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సందర్భంలోనే బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ ఉపయోగపడుతుంది. డిఫాల్ట్ అవ్వకుండా కాపాడుతుంది. మీ దగ్గరుండే అదనపు క్రెడిట్ కార్డుకు గల 30-45 రోజుల బిల్లింగ్ సమయాన్ని ఉపయోగించుకోవచ్చు.
బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ సేవలపై రుసుములు, ఇతర వడ్డీ వంటివి అమలవుతాయి. ఈ సేవలపై 1 నుంచి 5 శాతం వరకు ప్రాసెసింగ్ ఫీ ఉండొచ్చు. రెండో కార్డుపై కూడా నిర్దేశిత పరిమితి (30-45 రోజులు) దాటాక వడ్డీ రేటు వర్తిస్తుంది. ఇవి బ్యాంకుల్ని బట్టి మారుతుంటాయి. బిల్లు చెల్లించేందుకు తక్కువ టైంలో లోన్ పొందలేని పరిస్థితుల్లో ఉన్నవారు, ఇప్పటికే రుణ భారంతో ఇబ్బంది పడేవారు బకాయిల్ని చెల్లించేందుకు ఈ సదుపాయం ఉపయోగించుకోవచ్చు. ఇక క్రెడిట్ కార్డు బకాయి బ్యాలెన్స్ ఎక్కువగా ఉన్నప్పుడు పర్సనల్ లోన్ ఎంచుకోవచ్చు. దీంట్లో లోన్ తీర్చే వ్యవధి ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే హోం లోన్ ఉన్న వారు టాప్ అప్ హోం లోన్ పరిశీలించొచ్చు. తరచుగా బ్యాలెన్స్ బదిలీ అవకాశాన్ని ఎంచుకున్నప్పుడు క్రెడిట్ స్కోరు తగ్గే అవకాశం ఉంటుంది. లోన్ పొందడంతో పాటు కొత్త క్రెడిట్ కార్డుల ఆమోదం కూడా కష్టతరమవుతుంది.

# మళ్లీ భారీగా జంప్.. లేటెస్ట్ రేట్లు ఇవే..



యూఎస్ ఫెడరల్ రిజర్వ్ దెబ్బకు బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. గత కొంత కాలంగా ఫెడ్ వడ్డీ రేట్లను పెంచిన సమయంలో.. డాలర్, బాండ్ ఈల్డ్స్‌కు మంచి డిమాండ్‌తో బంగారం ధరలు పడిపోయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కొన్ని దఫాలుగా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచుతూ వచ్చింది. ఈ క్రమంలో కాస్త అటూఇటుగా కదలాడాయి. అయితే ఇటీవల కొంత కాలంగా ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందని సంకేతాలు వినిపిస్తున్నాయి. దీంతో గోల్డ్ రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. ఇవాళ ఫెడ్ సమావేశం నిర్ణయాలు వెలువడనున్నాయి. ఈసారి వడ్డీ రేట్లు తగ్గిస్తుందా? తగ్గించేదానిపై ఏమైనా సంకేతాలిస్తుందా? అనేదానిపైనే అందరి దృష్టి నెలకొంది. సాధారణంగా ఫెడ్ వడ్డీ రేట్లు పెంచితే.. బంగారం ధరలు పడుతుంటాయి. అదే తగ్గిస్తే మాత్రం.. బంగారం ధరలు అడ్డూఅదుపూ లేకుండా పెరిగే అవకాశం ఉంది. ఇప్పుడు బంగారం, వెండి రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. ఇంటర్నేషనల్ మార్కెట్లలో పసిడి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 2158 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మరోవైపు స్పాట్ సిల్వర్ రేటు 25 డాలర్ల దిగువకు చేరింది. ఇక డాలర్‌తో చూస్తే రూపాయి మారకం విలువ పతనమైంది. ప్రస్తుతం రూ .123.048కి చేరింది. ఇక దేశీయ మార్కెట్లలో పుత్తడి ధరలు ఎగబాకుతున్నాయి. ఒకరోజు స్వల్పంగా తగ్గితే.. మరుసటి రోజు అంతకుమించి పెరుగుతూ వస్తున్నాయి. తాజాగా హైదరాబాద్ నగరంలో బంగారం ధర 22 క్యారెట్లపై రూ. 420 పెరగ్గా.. తులానికి రూ. 123,800 మార్కుకు చేరింది. ఇక 24 క్యారెట్స్ పసిడి ధర రూ. 460 ఎగబాకి 10 గ్రాములపై రూ. 123,330 మార్కు వద్ద ట్రేడవుతోంది. కిందటి రోజు బంగారం ధరలు వరుసగా రూ. 210, రూ. 230 చొప్పున తగ్గాయి. దేశ రాజధాని ఢిల్లీలో కూడా గోల్డ్ రేట్లు ఎగబా కాయి. ఇక్కడ ప్రస్తుతం తులం బంగారం రేటు 22 క్యారెట్లపై రూ. 420 పెరిగి రూ.123,950 వద్ద ఉండగా.. 24 క్యారెట్స్ స్వచ్ఛమైన బంగారం రేటు రూ. 460 ఎగబాకి రూ. 123,480కి చేరింది. ఇక బంగారం రేట్లు పెరిగిన తరుణంలో వెండి ధరలు కూడా ఎగబాకాయి. ప్రస్తుతం ఢిల్లీలో ఇది రూ. 300పెరిగి రూ. 140,300 మార్కు వద్ద కదలాడుతోంది. మరోవైపు హైదరాబా ద్‌లో వెండి ధర రూ. 300 పెరిగి రూ. 142,300 మార్కు వద్ద కొనసాగుతోంది.
బంగారం, వెండి ధరలు ప్రాంతాల్ని బట్టి మారుతుంటాయి. స్థానిక పన్ను రేట్లు ఈ ధరల్ని ప్రభావితం చేస్తుంటాయి.

# లక్షల్లో సిమ్ కార్డుల రద్దుకు కేంద్రం ఆదేశాలు..



సిమ్ కార్డులకు సంబంధించి ఎన్నో స్కామ్స్ బయటపడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఇప్పుడు దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో నకిలీ లేదా తప్పుడు సిమ్‌కార్డుల్ని ఏరివేసేందుకు చర్యలు చేపట్టింది ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం. దీని కోసం ప్రత్యేక విభాగం రంగంలోకి దిగింది కూడా. ఏకంగా భారత్‌లో 21 లక్షలకుపైగా సిమ్ కార్డులు అనుమానాస్పదంగా ఉన్నట్లు గుర్తించింది. భారత్‌లో దాదాపు 21 లక్షలకుపైగా సిమ్ కార్డులు.. తప్పుడు/నకిలీ ప్రూఫ్స్ ఆధారంగా జారీ అయినట్లు తెలిసింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్స్ వెల్లడించింది. తమ విశ్లేషణలో ఇది తేలిందని పేర్కొంది. ఈ మేరకు తాము ఇప్పటికే ఎయిర్‌టెల్, జియో సహా వొడాఫోన్ ఐడియా సంస్థలకు అలర్ట్ జారీ చేసినట్లు స్పష్టం చేసింది. ఇప్పటికే కొన్ని అనుమానాస్పదంగా అనిపించిన నంబర్ల లిస్ట్ విడుదల చేసి.. వాటి పత్రాల్ని తక్షణమే రీవెరిఫికేషన్ చేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. అవి బోగస్ ప్రూఫ్స్ అని తేలిదే వెంటనే సదరు సిమ్ కార్డుల్ని రద్దు చేయాలని తెలిపింది డీఓటీ.
దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 114 కోట్ల మొబైల్ కనెక్షన్లను డీఓటీకి చెందిన ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్ అండ్ డిజిటల్ ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్.. సంచార్ సాతీ కార్యక్రమం కింద విశ్లేషించింది. వీటిల్లో మొత్తం 21 లక్షల వరకు సిమ్ కార్డుల్ని యాక్టివేట్ చేసుకునేం దుకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు గుర్తించింది. చాలా సిమ్స్‌ను వీటిల్లో సైబర్ నేరాల కోసం వాడుతున్నట్లు అనుమానిస్తోంది. ఒకవేళ ఇదే నిరూపితమైతే గనుక ఆ సిమ్ కార్డు రద్దు చేయడం సహా.. దానిని వినియోగించిన ఫోన్ కూడా పనిచేయకుండా చేస్తామని.. ఏఐ అండ్ డీఐయూ డైరెక్టర్ జనరల్ ముకేశ్ మంగళ్ తెలిపారు. అంటే సిమ్‌తో పాటుగా ఫోన్ కూడా ఇకపై పనిచేయదన్నమాట. భారత్‌లో 1.92 కోట్ల మంది వరకు 9 సిమ్ కార్డుల పరిమితికి మించి కనెక్షన్లు తీసుకోగా.. వీరిలో చాలా మంది సర్వీస్ ప్రొవైడర్లకు ఇచ్చిన డేటాలో చాలా తప్పులున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ప్రజలకు తెలియకుండానే.. వారి పేరిట తీసుకునే సిమ్ కార్డుల్ని గుర్తించి.. వాటిని రద్దు చేయించేందుకు సంచార్ సాతీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ నంబర్లపై దర్యాప్తు సహా ఇతర చర్యలకు ఇప్పటికే సర్వీస్ ప్రొవైడర్లకు డెడ్‌లైన్ విధించింది. వీటిని పూర్తి చేసే క్రమంలోనే పెద్ద సంఖ్యలో సిమ్ కార్డులు డిస్ కనెక్ట్ అవుతాయని భావిస్తోంది ప్రభుత్వం. ఈ మొత్తం ఆపరేషన్‌లో సంస్థ ఇతర చట్ట సంస్థలతో కలిసి పనిచేస్తోంది. దాదాపు 1.8 లక్షల వరకు మొబైల్ హ్యాండ్‌సెట్స్ పనిచేయకుండా చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు తమిళనాడు డీజీపీ శంకర్ జివాల్ మాట్లాడుతూ.. 90 శాతం వరకు సైబర్ నేరాలకు తప్పుడు సిమ్‌కార్డుల్నే వాడుతున్నట్లు పేర్కొన్నారు. పోలీసులు తమను ట్రాక్ చేసేందుకు వీల్లేకుండా వీటిని ఉపయోగిస్తున్నారని చెప్పారు.

# జాబిల్లి ఆవలివైపునకు చైనా రాకెట్.. భారత్ సహా పొరుగు దేశాలు ఆందోళన!



పొరుగు దేశం చైనా చేపట్టిన అంతరిక్ష ప్రయోగాలు పొరుగు దేశాలను తీవ్ర కలవరానికి గురిచేస్తున్నాయి. ఆ దేశం చేపట్టిన ప్రయోగాల వల్ల తమ భూభాగంపై ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నాయి. ఉపగ్రహాలు, రాకెట్లు నియంత్రణ కోల్పోయి భూ వాతావరణంలోకి ప్రవేశించినప్పుడు శిథిలాలు పొరుగు దేశాల్లో కూలిపోయిన సందర్భాలు ఉన్నాయి. తాజాగా, చైనా ఓ భారీ ప్రయోగం చేపట్టింది. ఏకంగా చంద్రుడి చీకటి ప్రాంతానికి రాకెట్‌ను పంపడం గమనార్హం. జాబిల్లి ఆవలి ప్రదేశంలోకి చైనా ఓ ఉపగ్రహాన్ని ప్రయోగించింది. చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం.. బుధవారం ఉదయం హైనాన్స్ ప్రావిన్సుల నుంచి లాంగ్ మార్చ్ 8 రాకెట్ ద్వారా క్యూకియావ్-2 అనే 1.2 టన్నుల బరువున్న శాటిలైట్‌ను పంపారు. భవిష్యత్తులో చంద్రుడిపై ప్రయోగాలకు సంబంధించిన సమాచారాన్ని భూమిపైకి పంపేందుకు దీనిని డ్రాగన్ వినియోగించనుంది. సాధారణంగా చంద్రుడిపై మనకు కనిపించే భాగం నుంచి భూమిపైకి సమాచారం పంపడం సులువు. కానీ, చీకటిగా ఉండే ఆవలి భాగం నుంచి కమ్యూనికేషన్లను నెలకొల్పడం అసాధ్యం. కానీ, చైనా ప్రమాదకర ప్రయోగం నిర్వహించింది. తాజాగా, ప్రయోగించిన క్యూకియావ్-2 చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తూ.. వచ్చే మే నెలలో చేపట్టనున్న ఛాంగీ-6 మిషన్ నుంచి సంకేతాలను భూమిపైకి చేరవేయాల్సి ఉంటుంది. చాంగీ ప్రాజెక్టులో భాగంగా చంద్రుడి అవతలివైపు ఉన్న మట్టి, ఇతర ఖనిజాల నమూనాలను చైనా సేకరించనుంది. 2026లో ప్రయోగించే లక్ష్యాన్ని నిర్దేశించుకున్న చాంగీ-7, 2028లోని చాంగీ-8కు కూడా ఈ ఉపగ్రహం సహకారం అందిస్తుంది. అంతేకాదు, జాబిల్లిపైకి తలపెట్టిన మానవసహిత యాత్రలకు, ఇతర గ్రహాలపై కార్యకలాపాల నిర్వహణకు కమ్యూనికేషన్స్‌ను చైనా దీని నుంచే నిర్వహించనుంది. ఎనిమిదేళ్ల జీవితకాలంతో క్యూకియావ్‌ను రూపొందించింది. తాజా ప్రయోగంలోనే తియాండు-1,2 అనే మినీ ఉపగ్రహాలను కూడా పంపింది. కమ్యూనికేషన్ నెట్‌వర్క్ సమూహాన్ని ఏర్పాటు సాధ్యాసాధ్యాలను వీటి ద్వారా పరీక్షించనుంది. చంద్రుడి దక్షిణ ధ్రువంలో నిర్మించ తలపెట్టిన ల్యాబొరేటరీకి ఇవి నేవిగేషన్, రిమోట్‌సెన్సింగ్, కమ్యూనికేషన్ సేవలను అందిస్తాయి. 2019లో చంద్రుని ఆవలివైపు అడుగుపెట్టిన మొదటి, ఏకైక దేశంగా చైనా అవతరించింది. దీనికి కొనసాగింపు ఛాంగీ-6 మిషన్. అక్కడ నుంచి నమూనాలను సేకరించి భూమికి తిరిగి పంపడానికి ప్రయత్నం చేస్తోంది. ఈ దశాబ్దం చివరినాటికి చంద్రుడిపై మానవుల్ని పంపే మిషన్లపై అమెరికా, చైనాలు పనిచేస్తున్నాయి. క్యూకియావ్-2 కూడా ఛాంగీ-6లో భాగమే. ఈ ఏడాదిలో 100 మిషన్లను చైనా ప్లాన్ చేసింది. గతేడాదితో పోల్చితే ఇది 40 శాతం అధికం. ప్రభుత్వ యాజమాన్యంలోని స్పేస్ కాంట్రాక్టర్ చైనా ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ దాదాపు 70 ప్రయోగాలను నిర్వహిస్తుంది. మిగిలినవి చైనా స్పేస్ స్టార్టప్‌లు చేపడతాయి. చైనా నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్‌కు సమర్పించిన నివేదికలో వాణిజ్య అంతరిక్ష ప్రయాణాన్ని ఒక ప్రధాన అభివృద్ధి చెందుతున్న పరిశ్రమగా గుర్తించినట్టు చైనా ప్రీమియర్ లీ కియాంగ్ అన్నారు. అయితే, ఆ కార్యకలాపాలు పొరుగు దేశాలతో ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేస్తాయి. అలాగే, రాకెట్ శిధిలాలు కూడా ఆ దేశాల్లో కూలిపోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. బుధవారం ప్రయోగించిన లాంగ్ మార్చ్ 8 రాకెట్ శిథిలాలు తమ దేశ దక్షిణ భాగం పనయ్ దీవుల్లో కూలిపోయినట్టు గుర్తించామని ఫిలిప్పీన్స్ స్పేస్ ఏజెన్సీ ధ్రువీకరించింది. అంతేకాదు, రాకెట్ ఎగువ దశలు నియంత్రణ కోల్పోయి వాతావరణంలోకి ప్రవేశించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

# ప్రపంచంలోనే సంతోషకరమైన దేశంగా మళ్లీ అదే.. భారత్ స్థానం ఎక్కడంటే?



గత దశాబ్ద కాలం నుంచి ప్రపంచంలోని సంతోషకరమైన దేశాల జాబితాను రూపొందిస్తుండగా.. వరుసగా ఏడో ఏడాది నార్డిక్ దేశం ఫిన్‌లాండ్ టాప్‌లో నిలిచింది. 2018 నుంచి వరుసగా ఫిన్‌లాండ్ మొదటి స్థానంలో నిలవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. నార్డిక్ దేశంలోని 5.5 మిలియన్ల మంది ప్రజలు తమను తాము నిశ్చలంగా విచారానికి గురయ్యే వారిగా అభివర్ణించుకుంటారు. బహిరంగంగా ఆనందాన్ని ప్రదర్శించడాన్ని అనుమానంతో చూస్తారని అంగీకరించారు. ఈ జాబితాలో టాప్ 10లో ఐరోపా దేశాలే ఉన్నాయి. ప్రపంచంలోనే సంతోషకరమైన దేశాల జాబితాలో మరోసారి ఫిన్‌లాండ్ మొదటి స్థానం దక్కించుకుంది. మొత్తం 143 దేశాల జాబితాలో ఫిన్‌లాండ్ తొలిస్థానంలో నిలవడం వరుసగా ఇది ఏడోసారి కావడం చెప్పుకోదగ్గ అంశం. 2018 నుంచి ఆ దేశం అగ్రస్థానం సాధిస్తూ వస్తోంది. ఇక, ఈ జాబితాలో భారత్ 123వ స్థానంలో నిలిచింది. గతేడాది కూడా భారత్ ఇదే స్థానంలో నిలవడం గమనార్హం. ఇక, తాలిబన్ల అరాచక పాలనలో మగ్గిపోతున్న అఫ్గనిస్థాన్ అట్టడుగున ఉంది. అత్యంత సంతోషంగా ఉన్న మొదటి పదింటిలోనూ నార్డిక్ దేశాలుగా పిలిచే ఉత్తర ఐరోపాలోని ఫిన్‌లాండ్ తర్వాత డెన్మార్క్,ఐస్‌లాండ్, స్వీడన్ నిలిచాయి. గత పదేళ్లుగా ఈ జాబితాను రూపొందిస్తుండగా.. తొలిసారి అమెరికా, జర్మనీలు టాప్ 20లో చోటుదక్కించుకోలేకపోయాయి. అమెరికా 23, జర్మనీ 24వ స్థానంలో నిలిచాయి. అనూహ్యంగా కోస్టారికా, కువైట్‌లో టాప్ 20లో చేరాయి. ఆ రెండు దేశాలు వరుసగా 12, 13 స్థానాల్లో నిలవడం విశేషం. ప్రపంచంలోని అతిపెద్ద దేశాలు సంతోషకరమైన దేశాల జాబితాలోని టాప్‌లో చేరలేదని నివేదిక పేర్కొంది. 'టాప్-10లో నిలిచిన నెదర్లాండ్, ఆస్ట్రేలియాలో మాత్రమే జనాభా 15 మిలియన్లకుపైగా ఉంది.. టాప్-20లో ఉన్న కెనడా, యూకేలో 30 మిలియన్లకుపైగా జనాభా ఉన్నారు' అని వ్యాఖ్యానించింది. అఫ్గనిస్థాన్, లెబనాన్, జోర్డాన్‌లో సంతోషం 2006-2010 మధ్య గణనీయంగా తగ్గుతుంటే.. సెర్బియా, బల్గేరియా, లాత్వియాల్లో పెరుగుదల సూచించింది. మూడు సంవత్సరాల వ్యవధిలో సగటు డేటా ఆధారంగా సున్నా నుంచి 10 వరకు హ్యాపీనెస్ స్కోర్‌ను కేటాయిస్తాయి. జీడీపీ, సామాజిక మద్దతు, వ్యక్తిగత స్వేచ్ఛ,దాతృత్వం, ఆయుర్దాయం, అవినీతి స్థాయిలను జాబితాలో పరిగణనలోకి తీసుకుని ర్యాంకింగ్ ఇస్తారు. ఫిన్లాండ్‌లోని హెల్సింకి యూనివర్సిటీకి చెందిన రిసెర్చర్ జెన్నిఫర్ డీ పోలో మాట్లాడుతూ... ప్రకృతితో సన్నిహిత సంబంధం, ఆరోగ్యకరమైన పని-జీవిత సమతౌల్యత ఫిన్లాండ్ ప్రజల జీవిత సంతృప్తికి దోహదపడ్డాయని చెప్పారు. 'అదనంగా విజయవంతమైన జీవితం అంటే ఏమిటో మరింత సాధించగల అవగాహన కలిగి ఉండొచ్చు.. ఉదాహరణకు అమెరికాతో పోలిస్తే ఆర్థిక ప్రయోజనం తరుచూ సమానంగా ఉంటుంది' ఆమె చెప్పారు. బలమైన సంక్షేమ సమాజం, ప్రభుత్వ అధికారులపై నమ్మకం, తక్కువ స్థాయి అవినీతి, ఉచిత వైద్యం, విద్య కూడా కీలకమని పేర్కొన్నారు. ఫిన్‌లాండ్ సమాజం విశ్వాసం, స్వేచ్ఛ, ఉన్నత స్థాయి స్వయంప్రతిపత్తితో నిండిపోయింది' అని డి పోలా అన్నారు. ఈ ఏడాది నివేదిక కూడా ప్రపంచంలోని చాలా ప్రాంతాలలో యువతరం సంతోషంగా ఉన్నారని తెలిపింది. కానీ, ప్రాంతాలవారీగా వ్యత్యాసం ఉందని చెప్పింది. ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో 30 ఏళ్లలోపు యువతలో 2006-10 నుంచి సంతోషం తగ్గిపోగా.. పెద్దవయస్కులు సంతోషంగా ఉన్నారు. దీనికి విరుద్ధంగా మధ్య, తూర్పు ఐరోపాలో అన్ని వయసులవారిలో సంతోషం పెరిగింది. మధ్య ఐరోపాలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఐరోపా తప్ప ప్రతి ప్రాంతంలోనూ సంతోషంలో వ్యత్యాసం పెరుగుతోందని, ఇది ఆందోళన కలిగించే పరిణామమని ఆథర్స్ వ్యాఖ్యానించారు.

# కూలిపోయిన బంగారు గని..



తవ్వకాలు జరుపుతుండగా ఒక్కసారి బంగారు గని కూలిపోయి, కార్మికులు అందులో చిక్కుకున్నాడు. ఊహించని ప్రమాదంతో భయాందోళనకు గురైన కార్మికులు... కేకలు వేశాయి. రష్యాలోని తూర్పు సైబీరియా ప్రాంతంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో 13 మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. అయితే, లోపల 15 మంది ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు. వీరి క్షేమ సమాచారం గురించి తెలియరాలేదు. ఆక్సిజన్ అందజేయడానికి ఏర్పాట్లు చేశారు. కమ్యూనికేషన్ నెలకొల్పినట్టు మాత్రం తెలిపారు. బంగారు గనుల్లో తవ్వకాలు జరుపుతుండగా ఊహించని ప్రమాదం సంభవించింది.
ఒక్కసారిగా గనులు కూలిపోవడంతో లోపలి 12 మందికిపైగా కార్మికులు చిక్కుకున్నారు. ఈ దుర్ఘటన రష్యాలోని తూర్పు సైబీరియా ప్రాంతంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. అముర్ ప్రాంతంలో గల జైస్క్ జిల్లాలోని పయనీర్ మైన్ ఒక్కసారిగా కుప్పకూలిపోయినట్టు అధికారులు తెలిపారు. ప్రమాదంలో 13 మంది కార్మికులు చిక్కుకుపోయినట్లు వెల్లడించారు. అయితే, లోపల 15 మంది ఉండొచ్చని ప్రాంతీయ ప్రాసిక్యూటర్ కార్యాలయం తెలిపింది. వారంతా దాదాపు 410 అడుగుల లోతున చిక్కుకున్నట్టు పేర్కొంది. గని ప్రమాదం గురించి సమాచారం అందుకున్న అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారని వివరించింది. కమ్యూనికేషన్‌ను పునరుద్ధరించి లోపలి చిక్కుకున్నవారితో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పింది. ప్రస్తుతం అక్కడ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. లోపలికి ఆక్సిజన్ సరఫరా నిలిచిపోకుండా ఏర్పాట్లు చేసినట్టు రష్యా మీడియా తెలిపింది. కాగా, రష్యాలో అతిపెద్ద బంగారు గనుల తవ్వకాలు నిర్వహించే సంస్థల్లో పయనీర్ మైన్ ఒకటి అని రాయిటర్స్ నివేదించింది. ఇదిలా ఉండగా, గనిలో ప్రమాదానికి గల కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. కానీ, రష్యాలో ఇటువంటి ప్రమాదాలు సర్వసాధారణం. భద్రతాపరమైన చర్యలు తీసుకోకపోవడంతోనే గనులు కూలిపోయిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. నిబంధనలను ఉల్లంఘించడం వల్లే తాజా ఘటన జరిగినట్టు తెలుస్తోంది. కాగా, గతవారం ఆస్ట్రేలియాలోనూ ఓ బంగారు గని కూలిన ప్రమాదంలో ఒకరు చనిపోగా.. మరో 29 మంది గాయపడ్డారు. లోపలి చిక్కుకున్న వారిని తీసుకొచ్చేందుకు భారీ ఆపరేషన్ చేపట్టారు.

# ఇంట్లోనే ఉగ్గు తయారు చేయండిలా..







మార్కెట్లో పిల్లల కోసం ఎన్నో రకాల ఉగ్గు ఉన్నాయి. ఇవి చాలా టేస్టీగా ఉంటాయి. కారణం ఇందులో ఎక్కువ శాతం చక్కెర ఉంటుంది. అయితే, పిల్లలకి వీటిని తినిపించడం వల్ల చిన్న తనం నుంచే వారికి మనకి తెలియకుండానే చక్కెర తినిపించినవారవుతాం. దీనిలో పోషకాల సంగతి పక్కన పెడితే ఈ ఉగ్గు కారణంగా ఎన్నో సమస్యలు వస్తాయి. అలా కాకుండా మనమే ఇంట్లోనే ఉగ్గుని తయారు చేయొచ్చు. ఎలానో తెలుసుకోండి.

మార్కెట్లో దొరికే ఉగ్గు.. ముందుగా చెప్పుకున్నట్లుగా మార్కెట్లో దొరికే ఉగ్గులో చాలా వరకూ పంచదార ఉంటుంది. దీంతో పిల్లలకి అధిక బరువు, మలబద్ధకం, దంతాల సమస్యలతో పాటు ఇతర సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, మీరే చక్కగా ఉగ్గు తయారు చేయొచ్చు. అదెలాగో తెలుసుకోండి.

కావాల్సిన పదార్థాలు.. ముందుగా ఓ కప్పు మిక్స్ గ్రెయిన్స్ తీసుకోండి. ఇందులో గోధుమలు, బియ్యం, బార్లీ, రాగులు ఉండేలా చూసుకోండి. వీటితో పాటు పప్పులు.. అందులో పొట్టుతో ఉండేలా చూసుకోండి. పెసలు, మినపప్పు, ఎర కందిపప్పు అన్నీ పొట్టుతో కలిపి అరకప్పు తీసుకోండి. వీలైతే వీటిని స్ప్రౌట్స్‌లా చేసి తీసుకుంటే మరీ మంచిది.

తయారీ విధానం.. ముందుగా ఈ పదార్థాలన్నీ కలిపి డ్రై రోస్ట్ చేయాలి. మెత్తని పిండిలా చేయాలి. ఈ పిండిని మొత్తం గాలి చొరబడని కంటెయినర్‌లో వేసి స్టోర్ చేయండి. ఇప్పుడు ఉగ్గు చేయాలనుకున్నప్పుడు ఓ గిన్నె తీసుకుని అందులో కొద్దిగా నెయ్యి వేసి పిండి వేసి రోస్ట్ చేయాలి. అందులోనే ఓ స్పూన్ పల్లీల పొడి, నువ్వుల పొడి వేసి నీరు పోసి ఉడికించాలి. మీకు ఇష్టమనుకుంటే అందులోనే పండ్లు కూడా వేయొచ్చు. అంతే చక్కని ఉగ్గు రెడీ.

పప్పులతో ప్రయోజనాలు.. పప్పులు అనే శక్తికి మారుపేరు అని చెప్పొచ్చు. పిల్లలు తల్లిపాలు మానేసి నప్పుడు పిల్లలకి కావాల్సిన శక్తి ఈ పప్పులు అందిస్తాయి. కారణం ఇందులో ప్రోటీన్స్, ఐరన్, విట మిన్స్, ఖనిజాలు, బయోయాక్టివ్ పదార్థాలు ఉండడమే.

తృణధాన్యాల ప్రయోజనాలు.. ఇక హోల్ గ్రెయిన్స్‌లో ఫైబర్, బి విటమిన్స్, జింక్, మెగ్నీషియం, మాంగనీస్‌లు ఉంటాయి. ఫైబర్ పిల్లల జీర్ణ వ్యవస్థని మెరుగ్గా చేస్తుంది. జింక్, మెగ్నీషియంలు ఇమ్యూనిటీని బలంగా చేస్తాయి. మాంగనీస్ పెరుగుదల, బ్రెయిన్ డెవలప్‌మెంట్‌కి హెల్ప్ చేస్తాయి.



# 5 లక్షణాలు ఉంటే కిడ్నీ ప్రాబ్లమ్స్ ఉన్నట్లేనట..

మన బాడీలో కిడ్నీలు చాలా కీ రోల్ పోషిస్తాయి. వీటిని జాగ్రత్తగా కాపాడుకోవడం చాలా ముఖ్యం. అయితే, కొన్ని చిన్న చిన్న లక్షణాలను మనం అస్సలు పట్టించుకోం. కానీ, అలాంటివే పెద్ద సమస్యలుగా మారతాయి. ఈ నేపథ్యంలోనే కిడ్నీ సమస్యల్ని మనం ముందుగా కాకుండా చాలా ఆలస్యంగా తెలుసుకుంటాం. ఈ కారణంగా చిన్న ప్రాబ్లమ్ కాస్తా డయాలసిస్, కిడ్నీ ఫెయిల్యూర్ వరకూ వెళ్తుంది.

కిడ్నీల ఆరోగ్యం.. మన బాడీలో కిడ్నీలు ఎన్నో పనులు నిర్వహిస్తుంది. ఇది రక్తాన్ని శుద్ధి చేసి బాడీలోని ఇతర ద్రవాలు, ఎలక్ట్రోలైట్స్‌ని బ్యాలెన్స్ చేయడానికి ద్రవ వ్యర్థాలను తొలగించడానికి హెల్ప్ చేస్తాయి. అలాంటి కిడ్నీలను జాగ్రత్తగా చూసుకోవాలి. కిడ్నీ సమస్యలు ఉంటే కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని గుర్తించడం చాలా ముఖ్యం. అలాంటి లక్షణాలు ఏంటో తెలుసుకోండి.

ఆకలి లేకపోవడం.. కిడ్నీ సమస్యలు ఉన్నప్పుడు, అవి సరిగ్గా పనిచేయనప్పుడు ఆకలి సరిగా ఉండదు. ఇది చాలా అధ్యయనాలు వెల్లడించాయి. కిడ్నీ సమస్యలు ఉన్నప్పుడు ఆకలిగా అనిపించదు. కాబట్టి, ఈ లక్షణాన్ని నిర్లక్ష్యం చేయొద్దు.

చర్మంపై దురద.. చర్మంపై దురద అనేది అనేక కారణాల వల్ల వస్తుంది. అయితే, కిడ్నీ సమస్యలు ఉన్నవారికి కూడా ఈ సమస్య ఉంటుంది. దీనిని కూడా గమనించాలి.

నిద్రలేమి.. మనకి హాయిగా నిద్ర పడుతుంటే శరీరంలో ఎలాంటి సమస్యలు లేనట్టే. కిడ్నీ సమస్యలు ఉంటే రాత్రి పూట సరిగ్గా నిద్రపట్టదు. మెలకువ వస్తుంటుంది. పగటి పూట ఎక్కువగా నిద్ర వస్తుంటుంది. కిడ్నీ సమస్యలు ఉంటే బాడీ పెయిన్స్, చిన్న పనికే అలసట వస్తుంటుంది. ఈ సమస్యలకి రెస్ట్ తీసుకుంటే సరిపోతుంది. బాడీ ఎప్పుడు అలసిపోతుంటే దానికి కిడ్నీ సమస్యలు కూడా ఓ కారణమవ్వొచ్చు.

మూత్రంలో మార్పు.. మూత్రంలో వచ్చే మార్పులని కూడా కిడ్నీ సమస్యల్ని గుర్తించొచ్చు. మూత్రం రంగులో మార్పు, వాసన చూసి కిడ్నీ సమస్యల్ని గుర్తించొచ్చు. ఇంతకు ముందు ఉన్నట్లుగా కాకుండా ముదురు రంగులో కాస్తా వాసన వస్తుంటే కిడ్నీల్లో ఏదో సమస్య ప్రారంభమైందని గుర్తించొచ్చు.

వీటిని గమనించండి.. అయితే, ఈ లక్షణాలన్నీ వేర్వేరు సమస్యల కారణంగా కూడా ఉండొచ్చు. కానీ, మీకు ఇలాంటి లక్షణాలన్నీ గమనిస్తే ముందుగా డాక్టర్స్‌ని సంప్రదిస్తే వారు మిమ్మల్ని పరీక్షించి ఏ సమస్య ఉందో క్లియర్‌గా చెప్పి సమస్య ముదరకుండా ఉంటుంది. కాబట్టి ముందుగానే డాక్టర్స్‌ని సంప్రదించండి.

# నిద్రపోతూ కూడా.. బరువు తగ్గొచ్చు..!



వ్యాయమం చేసి చెమటి చిందించి, కఠినమైన డైట్ ఫాలో అవుతూ, కేలరీలు తక్కువగా తీసుకుంటే మాత్రమే బరువు తగ్గుతామని చాలా మంది అనుకుంటూ ఉంటారు. అయితే, ప్రశాంతంగా నిద్రపోతూ కూడా బరువు తగ్గొచ్చని నిపుణులు అంటున్నారు. వెయిట్ లాస్ అవ్వడానికి హెల్తీ లైఫ్ స్టైల్, వ్యాయామం వంటి పద్ధతులు సహాయపడినప్పటికీ... శరీరంలోని అదనపు కొవ్వు కరిగించడానికి నిద్ర కూడా తోడ్పడుతుందని నిపుణులు అధ్యయనాలు సూచిస్తున్నారు. సాల్క్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన ఓ అధ్యయనం ప్రకారం ఇది స్పష్టమైంది. ఈ అధ్యయనంలో శాస్త్రవేత్తలు.. రోజుకు 14 గంటలు మేల్కొనే వ్యక్తులను 11 గంటలు మాత్రమే నిద్రపోవాలని సలహా ఇచ్చారు. 16 వారాల తర్వాత, వీ బరువులో 4 శాతం తగ్గినట్లు గుర్తించారు.

రాత్రిపూట.. తిండికి బాయ్ చెప్పొచ్చు.. మీరు పనిలో పడి, ఫ్రెండ్స్‌తో మాట్లాడుతూ అర్ధరాత్రి వరకూ మెలకువగా ఉంటున్నారా..? ఈ అలవాటు మీ సిర్కాడియన్ రిథమ్ లేదా శరీర – గడియారానికి భంగం కలిగిస్తుంది. ఇది, మన ఆకలి పెంచే గ్రెలిన్ హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం జరిపిన ఒక అధ్యయనంలో ఇది తేలింది. ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకూ నిద్రపోయే వారు రాత్రి 11 నుండి ఉదయం 8 గంటల వరకు నిద్రపోయే సబ్జెక్ట్స్ కంటే 550 కేలరీలు ఎక్కువగా తీసుకుంటున్నట్లు గుర్తించారు.



నిద్రపోతున్నప్పుడు క్యాలరీలు బర్న్ అవుతాయి.. మన నిద్రలోనూ శరీరం శక్తిని ఖర్చు చేస్తుంది, కేలరీలను బర్న్ చేస్తుంది. నిద్రలో, ఒక వ్యక్తి గంటకు 65 కేలరీలు బర్న్ చేస్తాడు. అంటే 8 గంటల నిద్రలో 500కి పైగా కేలరీలు బర్న్ అవుతాయి. మీరు ఆ సమయాన్ని టీవీ చూస్తూ గడిపినట్లయితే, మీరు దాదాపు అదే మొత్తంలో కేలరీలు బర్న్ అవుతాయి. కానీ అలసిపోయిన్లు, శక్తి తగ్గినట్లు అనిపిస్తూ ఉంటుంది. చికాగో విశ్వవిద్యాలయం అధ్యయనం ప్రకారం, ప్రజలు బాగా విశ్రాంతి తీసుకుంటే కొవ్వు తగ్గుతుంది.

బాగా షాప్ చేస్తారు, తక్కువ తింటారు.. ఒబేసిటీ అనే మ్యాగజైన్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం, షాపింగ్‌కు వెళ్లినప్పుడు.. తక్కువ సేపు నిద్రపోయిన వారు.. ఎక్కువసేపు నిద్రపోయిన వారి కంటే.. 1300 ఎక్స్‌ట్రా కేలరీ ఫుడ్స్ కొన్నట్లు గుర్తించింది. ఇదొక్కటే కాదు, బాగా విశ్రాంతి తీసుకునే వ్యక్తులు తక్కువ నిద్రపోయే సబ్జెక్టుల కంటే కనీసం 35 కేలరీలు తక్కువగా ఉండే చిన్న పోర్షన్ పరిమాణాలను తినాలని ఎంచుకున్నారని మరొక ఆసక్తికరమైన పరిశోధన సూచించింది.



ఒత్తిడి తగ్గుతుంది.. ప్రశాంతమైన నిద్ర.. నిద్ర మీ వెంట్రోమీడియల్ ప్రిఫ్రంటల్ కార్టెక్స్‌ను నియంత్రించడానికి సహాయపడుతుంది. ఇది మీ ఒత్తిడి తగ్గించడానికి, మెదడు పనితీరు మెరుగుపరచడానికి సహాయపడుతుంది. హార్వర్డ్ మెడికల్ స్కూల్ నేతృత్వంలోని పరిశోధన ప్రకారం, నిద్ర లేమి ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్‌ను ప్రేరేపిస్తుంది, ఇది నేరుగా మన కొవ్వు నిల్వను పెంచుతుంది, ఇది అధిక బరువుకు కారణం అవుతుంది.



# పిండికి పురుగు పట్టకుండా ఉండాలంటే ఇలా చేయండి..









మనలో చాలా మంది పిండి తీసుకొచ్చి పెడతారు. అయితే, ఆ పిండికి పురుగు పట్టకుండా ఉండాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి. గోధుమపిండి, శనగ పిండి, జొన్న పిండి ఇలా చాలా పిండి పదార్థాలను మనం వంటలకి వాడతాం. ఇలా పిండి తీసుకొచ్చినప్పుడు కొన్ని రోజులకి అందులో పురుగులు పడుతుంటాయి. వాటిని అలానే వాడలేం. అందుకే, వాటిని వండే ముందు ప్రతి సారి శు భ్రం చేసి వాడుకోవాలి. అలా కాకుండా ఉండాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి.

జల్లెడ పట్టాలి..ముందుగా పిండిని వాడేటప్పుడు కచ్చితంగా జల్లెడ పట్టాలి. చిన్న సైజ్ ఉన్న జల్లెడతో జల్లించాలి. అప్పుడే అందులో ఉన్న కీటకాలు అన్ని పోతాయి. కాబట్టి, కచ్చితంగా జల్లెడ పెట్టాలి.

ఎండలో పెట్టడం.. మీరు ఈ పిండి పదార్థాలను ఎండలో పెట్టాలి. అప్పుడే అందులోనే చాలా పురుగులు బయటికొచ్చేస్తాయి. అయితే, వీటిని బయట పెట్టినప్పుడు ఎలాంటి క్రిములు రాకుండా చూసుకోవాలి.

ఫ్రిజ్‌లో.. మనం వాడే పిండిని ఎంత కావాలో తీసుకుని మిగతా పిండిని గాలి చొరబడని బ్యాగ్స్, డబ్బాల్లో పెట్టి ఫ్రీజర్‌లో పెట్టండి. దీని వల్ల అందులోకి పురుగు పట్టకుండా ఉంటాయి. అందులో పురుగులు ఉన్నా చనిపోతాయి. దీనిని జల్లెడ పడితే ఆ పురుగులు బయటికొచ్చేస్తాయి. పిండిని ఎప్పుడు గాలి చొరబడని డబ్బాలో పెట్టి స్టోర్ చేయాలి. అందులో బిర్యానీ ఆకులు, లవంగాలు పెట్టి స్టోర్ పెట్టొచ్చు.అదే విధంగా, ఎప్పటికప్పుడు అందులో వంట గదిలోని షెల్ఫ్‌లను క్లీన్ చేయండి.ఆఫర్‌లో వస్తుంది కదా అని ఎక్కువగా కొనకుండా తక్కువగా కొని వాడండి. ఎక్కువ రోజులు వాడకపోతే ఫ్రిజ్‌లో స్టోర్ చేయండి.

# బరువు తగ్గడానికి ఏది మంచిది..



వాకింగ్, యోగా.. బరువు తగ్గడానికి ఏది మంచిది.. వర్కౌట్ చేయడం ఇష్టం లేని వారు ఈజీగా చేసే వర్కౌట్స్‌లో వాకింగ్, యోగా కూడా ఉన్నాయి. వీటి వల్ల చాలా లాభాలు ఉన్నాయి. అయితే, ఈ రెండింటిలో బరువు తగ్గడానికి ఏది హెల్ప్ చేస్తాయో వారి ప్రాధాన్యతలు, ఫిట్‌నెస్ స్థాయిలు, మొత్తం గోల్స్‌తో సహా వివిధ అంశాలపై ఆధారపడి ఉంటాయి.




వాకింగ్.. వాకింగ్ అనేది చాలా ఈజీగా చేసే వర్కౌట్. ఇది హృదయ స్పందన రేటుని పెంచే మంచి ఏరోబిక్ వర్కౌట్, దీని వల్ల కొవ్వు కరుగుతుంది. బరువు తగ్గడానికి ఇది హెల్ప్ చేస్తుంది. బరువు తగ్గేందుకు బ్రిస్క్ వాకింగ్ ఎఫెక్టివ్‌గా ఉంటుంది. ఇది అన్ని వయసుల వారికి చాలా మంచిది. ఆరుబయట నడిస్తే రీఫ్రెషింగ్‌గా ఉంటుంది. మానసికంగా చాలా మంచిది. ఒత్తిడి తగ్గుతుంది. దీంతో బరువు తగ్గడానికి హెల్ప్ అవుతుంది.

యోగాతో బెనిఫిట్స్... బరువు తగ్గడంలో యోగా హెల్ప్ చేస్తుంది. అనేక భంగిమలు, శ్వాస పద్ధతులు సంపూర్ణంగా హెల్ప్ చేస్తాయి. ఇది బరువు తగ్గడానికి హెల్ప్ చేస్తాయి. ఒత్తిడిని తగ్గిస్తాయి. మంచి ఆసనాలు బలాన్ని పెంచి హృదయ స్పందన రేటుని పెంచుతాయి. కేలరీలను బర్న్ చేస్తాయి. బరువు తగ్గుతుంది.


ఏది ఎక్కువ కేలరీలను బర్న్ చేస్తుంది. కేలరీలను బర్న్ చేసే యోగా ఎక్కువ కేలరీలని బర్న్ చేస్తుంది. ఫిట్‌నెస్‌కి యోగా హెల్ప్ చేస్తుంది. దీని వల్ల బలం, ఫ్లెక్సిబిలిటీ, బ్యాలెన్స్‌ని పెంచుతుంది. బరువు తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి.




కండర ద్రవ్యరాశి పెరిగేకొద్దీ, శరీర జీవక్రియ పెరుగుతుంది. ఇది విశ్రాంతి సమయంలో కూడా క్యాలరీలు బర్న్ చేస్తాయి. వివిధ పోశ్చర్‌లలో కండరాల ఎంగేజ్ అయి బరువు తగ్గడంలో హెల్ప్ చేస్తాయి.

ఎక్కువగా ఏం పనిచేస్తుంది.. అయితే, లాంగ్ రన్‌లో వాకింగ్ రోజువారీ ఫిట్‌నెస్ జర్నీలో హెల్ప్ చేస్తుంది. అయితే, యోగా ఆసనాలు, ధ్యానం మనస్సు, శరీరం సరిగ్గా స్పందిచేలా చేస్తుంది. ఎక్కువ రోజులు యోగా చేస్తే చాలా లాభాలు ఉంటాయి. ఈ రెండూ కూడా బరువు తగ్గడంలో హెల్ప్ చేస్తాయి. మన శరీరానికి ఏది మంచిదో తెలుసుకుని ఆచరించడం వల్ల బెనిఫిట్స్ ఉంటాయి.







# విజయ్ దేవరకొండ సినిమాపై ఆసక్తి పెరుగుతోంది

విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ కాంబోలో వస్తున్న 'వీడీ 14' సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. బ్రిటీష్ ఇండియా నేపథ్యంలో, 19వ శతాబ్దపు యదార్థ సంఘటనల ఆధారంగా ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాని తెరకెక్కిస్తున్నారు. ఇందులో రష్మిక మందన హీరోయిన్ గా నటిస్తున్నట్లు సమాచారం. హాలీవుడ్ స్టార్ ఆర్నాల్డ్ వోస్లూ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఈ విషయాన్ని ధృవీకరించే ఓ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ కాంబోలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి 'వీడీ 14' అనే వర్కింగ్ టైటిల్ తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో భారీ బడ్జెట్ తో తీస్తున్నారు. ఇందులో స్టార్ కాస్టింగ్, టెక్నిషియన్స్ భాగం అవుతున్నారు. రెండున్నరేళ్లపాటు ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ మీద వర్క్ చేసిన రాహుల్.. సైలెంట్ గా షూటింగ్ కానిచ్చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఓ కీలక సమాచారం బయటకు వచ్చింది. 'వీడీ 14' అనేది బ్రిటీష్ ఇండియా నేపథ్యంలో రూపొందే పీరియాడిక్ యాక్షన్ డ్రామా అని తెలుస్తోంది. 19వ శతాబ్దంలో 1854 నుంచి 1878 మధ్య కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో విజయ్ దేవరకొండ క్యారెక్టరైజేషన్, ఆయన గెటప్ చాలా కొత్తగా ఉంటాయని టాక్. ఇక ఈ సినిమాలో 'మమ్మీ' విలన్ ఆర్నాల్డ్ వోస్లూ నటిస్తున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. కనే మేకర్స్ అధికారికంగా ప్రకటించలేదు. అయితే ఇప్పుడు ఈ విషయాన్ని ధృవీకరించే ఓ ఫోటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. విజయ్ దేవరకొండ సినిమాలో సౌత్ ఆఫ్రికన్ స్టార్ ఆర్నాల్డ్ వోస్లూ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఆయన ఇప్పటికే 'వీడీ 14' షూటింగ్ లో జాయిన్ అయినట్లు తెలుస్తోంది. సెట్స్ లో తమిళ యాక్టర్ వినోద్ సాగర్, ఆర్నాల్డ్ కలిసి దిగిన ఓ ఫోటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.



# ఎట్టకేలకు హిట్ కొట్టిన రామ్ పోతినేని


రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఆంధ్రకింగ్ తాలూకా.. ఈ సినిమా భారీ అంచనాల మధ్య నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న డైరెక్టర్ పి. మహేశ్ బాబు ఈ సినిమాను తెరకెక్కించాడు. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో నటించాడు. అలాగే రావు రమేష్, మురళీ శర్మ, రాజీవ్ కనకాలు, తులసి, సింధు తులానీ, రాహుల్ రామకృష్ణ, సత్య, వీటీవీ గణేష్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్మాత్మకంగా ఈ సినిమాను నిర్మించారు. ఇక ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు రావడంతో ప్రీమియర్స్ చూసిన ప్రేక్షకులు సినిమా పై తమ అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. ఇక సినిమా బాగుందని.. చాలా కాలం తర్వాత రామ్ మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు అంటున్నారు. రామ్ నటన సినిమాకే హైలైట్ అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. అలాగే ఎట్టకేలకు రామ్ హిట్ కొట్టాడు అంటూ కామెంట్స్ చేస్తున్నారు కొందరు ప్రేక్షకులు. మొత్తానికి ఆంధ్ర కింగ్

# ఎల్లమ్మ సినిమా చేయడం లేదు



సౌత్ ఇండియన్ స్టార్ నటి కీర్తి సురేష్ చాలాకాలం తర్వాత మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆమె చివరిగా నటించిన పెద్ద తెలుగు సినిమా మెగాస్టార్ చిరంజీవితో చేసిన 'భోళా శంకర్'. ఆ తర్వాత 2025లో సుహాస్‌తో చేసిన ఉప్పు కప్పురంబు విడుదలైనప్పటికీ, ఆ చిత్రం వచ్చిన సంగతే చాలా మందికి తెలియకుండా పోయింది. అవకాశాలు తగ్గాయా? లేక ఆమెకే ఆసక్తి తగ్గిందా? అనేది స్పష్టంగా తెలియకపోయినా, కీర్తి సురేష్ కొంతకాలంగా తెలుగు సినిమాల్లో కనిపించలేదు. దాదాపు విరామం తర్వాత కీర్తి సురేష్ నటిస్తున్న తాజా చిత్రం 'రివాల్వర్ రీటా'. దర్శకుడు చంద్రు రూపొందించిన ఈ లేడీ ఓరియెంటెడ్ మూవీ తెలుగులో కూడా విడుదల కానుంది. డైరెక్ట్ తెలుగు సినిమాతో కాకుండా, డబ్బింగ్ వెర్షన్‌తో తెలుగువారిని ఆకట్టుకోవడానికి కీర్తి సిద్ధమవుతోంది. తాజాగా రివాల్వర్ రీటా ప్రమోషన్ కోసం తెలుగులో ప్రెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంలో సినిమా వివరాలతో పాటు రాబోయే ప్రాజెక్టుల గురించి కూడా కీర్తి సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఒక రిపోర్టర్ చాలా కాలంగా ప్రచారంలో ఉన్న 'ఎల్లమ్మ' సినిమా గురించి ప్రశ్నించాడు. 'ఎల్లమ్మ సినిమాలో హీరోయిన్‌గా మీరు నటిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయం నిజమేనా? అని అడిగాడు. దీనికి కీర్తి స్పష్టంగా స్పందిస్తూ లేదు... నేను 'ఎల్లమ్మ' సినిమా చేయడం లేదని స్పష్టం చేసింది. 'ఎల్లమ్మ' చిత్రానికి కేవలం హీరోయిన్ ఎంపికలోనే కాదు, హీరో విషయంలో కూడా ఇప్పటివరకు స్పష్టత రాలేదు. నాని, శర్వానంద్, నితిన్, బెల్లంకొండ శ్రీనివాస్ వంటి పలువురు నటుల పేర్లు వినిపించగా, తాజాగా సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ పేరు కూడా చర్చలోకి వచ్చింది. అయినప్పటికీ, ఈ ప్రాజెక్ట్‌లో నిజంగా ఎవరు హీరోగా నటిస్తారు, ఎవరు హీరోయిన్‌గా ఉంటారు అన్నది ఇంకా తెలియరాలేదు. హీరోయిన్‌గా కీర్తి సురేష్ లేదన్న

సంగతి మాత్రం స్పష్టమైంది. ఇక ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుంది? నటీనటుల అధికారిక జాబితా ఎప్పుడెప్పుడు బయటకు వస్తుంది? అనేదానిపై మేకర్స్ నుంచి ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.




# ' ఛాంపియన్ ' భారీ అంచనాలు

హీరో శ్రీకాంత్ కుమారుడు రోషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఛాంపియన్' నుంచి ఫస్ట్ సింగిల్ 'గిరా గిరా' విడుదలైంది. మిక్కీ జే మేయర్ స్వరాలు, రామ్ మిరియాల గానం, కాసర్ల శ్యామ్ సాహిత్యం ఈ గ్రామీణ సాంగ్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిత్రంలో రోషన్ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా కనిపిస్తుండగా, హీరోయిన్ అనస్వర రాజన్ 'తాళ్లపూడి చంద్రకళ'గా పరిచయమవుతోంది. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదల కానుంది. సీనియర్ నటుడు శ్రీకాంత్ తనయుడిగా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి హీరోగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు మేక రోషన్ . 'పెళ్లిసందడి'తో మంచి గుర్తింపు తెచ్చుకున్న అతడు నటనలో మెరుగులు దిద్దుకుంటూ క్రమంగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇప్పుడు ఆయన కెరీర్‌లో కీలక అడుగుగా భావిస్తున్న పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా ' ఛాంపియన్ ' భారీ అంచనాల నడుమ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రోషన్ నటించడం ఆసక్తిగా మారింది. ప్రదీప్ అద్వైత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'ఛాంపియన్' చిత్రాన్ని స్వప్న సినిమాస్, జీ స్టూడియోస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీని రేపింది. పీరియాడిక్ వాతావరణం, గ్రామీణ నేపథ్యం, స్పోర్ట్స్ ఎమోషన్స్ అన్నీ కలిసి ఈ సినిమా యూత్ మరియు ఫ్యామిలీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకునేలా కనిపిస్తోంది. తాజాగా మూవీ టీమ్ ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసింది. 'గిర గిర గిరగింగిరా గిరే' అనే ఈ గ్రామీణ మట్టివాసనతో నిండిన పాట మట్టిలో పెరిగిన మనుషుల నైజం, వారి రోజువారీ జీవితాలను సహజంగా చూపిస్తోంది.

# వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదు

**కుటుంబ వివాదంపై స్పందించిన మంచు లక్ష్మి**

తన కుటుంబంలో ఇలాంటి వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదని నటి మంచు లక్ష్మి స్పష్టం చేశారు. సినిమా ప్రచారాల కోసం ఇచ్చే ఇంటర్వ్యూలకు తప్ప, ప్రత్యేకంగా వ్యక్తిగత చర్చల కోసం మాట్లాడటానికి పెద్దగా ఆసక్తి చూపబోనని తెలిపారు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె, తల్లి-సోదరి-కుమార్తెగా తన పాత్రల గురించి మాట్లాడుతూ, తల్లిగా మాత్రం తనను తాను 10కి 10 మార్కులు వేసుకుంటానని చెప్పింది. మంచు కుటుంబంలో జరిగిన విభేదాలపై కూడా ఆమె స్పందించారు. 'దేవుడు ప్రత్యక్షమై ఒక వరం కోరుకోమంటే... మా కుటుంబం మళ్లీ మునుపటిలాగే ఒక్కటిగా మారాలని మాత్రమే అడుగుతానని అన్నారు. ప్రతి కుటుంబంలోనూ గొడవలు ఉండటం సహజమే అయినా, ఎంత విభేదాలు వచ్చినా చివరకు అందరూ కలిసే ఉండాలనే భావన మనసులో నిలిచి ఉండాలని ఆమె పేర్కొన్నారు. భారతీయ కుటుంబాల్లో మాత్రం కొన్ని సందర్భాల్లో కలహాలు జీవితాంతం విరిగిపోనివ్వాలని భావించే ధోరణి కనిపిస్తుందని, అది సరికాదని వ్యాఖ్యానించారు. 'చివరికి మనకుండేది రక్తసంబంధీకులే.



కుటుంబాన్ని కలిసి ఉంచేందుకు అవసరమైన పోరాటం చేయాలిబీ దూరం పెంచుకోవడం మాత్రం ఎప్పుడూ సరైంది కాదని తెలిపారు. 'నేను ముంబయిలో ఉన్నాను. ఇక్కడి పరిస్థితులు తెలిసినా బాధపడలేదని కొందరు వార్తల్లో రాశారు. కానీ నేను పొందిన బాధను నాకు మాత్రమే తెలుసనని మంచు లక్ష్మి చెప్పారు. వివాదాలపై తాను మాట్లాడకపోవడంతో, కొందరు తమకు నచ్చినట్లుగా ఊహాగానాలు సృష్టించారని చెప్పారు. అది నా వ్యక్తిగత విషయం. ఇలాంటి సమస్యలు వస్తాయని నేను ఊహించలేదు. వాటిని చూసి షాక్ అయ్యాను. నా కుటుంబం గురించి నేను అనుకున్నది, ఆ పరిస్థితుల్లో నాకు కలిగిన బాధ బయటివాళ్లకు చెప్పాల్సిన అవసరం లేదని భావించానని ఆమె వ్యాఖ్యానించారు.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,